నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 03, 2024 | www.navatelangana.com

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-బేల

ఏకధాటిగా కురుస్తున్నా వర్షాలతో మండలంలోని పెన్‌గంగ నది తీరాన గల ఖోగ్దూర్, మాంగ్‌రూడ్, సాంగిడి, గూడ, మనియార్‌పూర్, భేదోడ శివారులో వందల ఎకరాల పొలాలు నీట మునిగాయని, ప్రభుత్వం బాధిత రైతులను ఆదుకోవాలని రైతు నాయకులు మంగేష్ ఠాక్రే అన్నారు. ఇప్పటి వరకు 3సార్లు ఎరువుల బస్తాలు, 4 సార్లు పురుగులమందు పిచికారి చేశామన్నారు. ఎకరానికి 40 నుండి 50 వేలు ఖర్చయ్యాయని తెలిపారు. జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే పాయల్ శంకర్, కలెక్టర్ చొరవ చూపి సర్వే నిర్వహించి నదీ తీరాన ఉన్న రైతులకు ఆదుకోవాలని గవాండే చంద్రకాంత్, డాక్రే రూపేష్, చౌడల్ దిలీప్, ఠాక్రే ప్రఫుల్, టేకం నేతాజీ, అమూల్, ఠాక్రే విలాస్, డౌలె విఠల్, డౌలే రూపేష్, వాంఖడే బబన్, డాకరే రత్నాకర్ కోరరు.

సదర్మాట్‌కు వరద పోటు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని సదర్మాట్ ఆనకట్టకు భారీగా వరద చేరి కట్ట పైనుంచి పారుతోంది. ఎగువన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 40గేట్లు ఎత్తి నీరు వదలడంతో గోదావరి నది పొంగి ప్రవహిస్తోంది. దీంతో కొత్త సదర్మాట్ బ్యారేజీలోకి భారీ స్థాయిలో వరద చేరింది. 36 గేట్లు ఎత్తి బ్యారేజీ నీటిని దిగువకు వదిలారు. ఈ ప్రవాహంతో సదర్మాట్ ఆనకట్టలో 11అడుగులు దాటి నీరు చేరడంతో ముందు జాగ్రత్తగా అధికారులు లెఫ్ట్, రైట్ కెనాల్‌లకు నీటి సరఫరా నిలిపేశారు. ఎగువ నుంచి ఆనకట్టలోకి వస్తున్న 55 వేల క్యూసెక్కుల నీరు అలాగే గోదావరి నదిలో దిగువకు వెళ్తోంది.



వీడని వరద ముప్పు..!

- ప్రమాదకరంగా ప్రవహిస్తున్న పెన్‌గంగ, ప్రాణహిత నదులు
- గ్రామాలను చుట్టుముట్టిన జలం..రాకపోకలకు అంతరాయం
- పరివాహక ప్రాంతాల్లో నీటమునిగిన పొలాలు
- ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు


గేట్లు ఎత్తడంతో ఉరకలెత్తుతున్న కడెం ప్రాజెక్టు

ఉమ్మడి జిల్లాను ప్రస్తుతానికి వర్షం వీడినా..ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా వరద కష్టాలు మాత్రం తీరడం లేదు. శని, ఆదివారాల్లో ఉమ్మడి జిల్లాలో కురిసిన వర్షాలతో జనజీవనం అతలాకుతలం కాగా సోమవారం వర్ష భయం కొంత వీడినా వరద ముప్పు మాత్రం వీడటం లేదు. ఎగువన మహారాష్ట్ర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు..అక్కడి ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఆ ప్రభావం జిల్లా మీద పడుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దున ఉన్న పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెన్‌గంగ బ్రిడ్జికి ఆనుకొని ప్రవహిస్తుండటం..ఈ నది పరివాహక ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయి. ప్రాణహిత నది సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్యాక్ వాటర్ కారణంగా పలు పంట పొలాలు నీటిలోనే ఉండిపోయాయి. పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహించడంతో దీనిలో కలిసే ఇతర వాగులు, వంకలు దిశ మార్చుకొని పలు గ్రామాలను చుట్టుముట్టాయి. దీంతో పలు గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని అంచనా వేస్తూ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేశాయి. ఎడతెరిపి లేకుండా జోరు వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. జీవ జీవనం అస్తవ్యస్తంగా మారింది. సోమవారం వర్షం కొంత తెరిపిచ్చినా..అంతకుముందు కురిసిన భారీ వర్షం కారణంగా వరద భయం మాత్రం వీడటం లేదు. పలు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టడంతో ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి కనిపిస్తోంది. అత్యవసర పనిమీద రావాలంటే ఇతర ప్రాంతాల గుండా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా సరిహద్దున ఉన్న పెన్‌గంగ నది ఉగ్రరూపం దాల్చింది. డొల్లార వద్ద బ్రిడ్జికి సమానంగా ప్రవహించడంతో సమీపంలోని పంట పొలాల్లోకి వరద పోటెత్తింది. దీంతో డొల్లార, పెండల్‌వాడ, సాంగ్వి,ఆనంద్‌పూర్ గ్రామాల అంచుల వరకు నీరు వెళ్లింది. కామాయి గ్రామాన్ని వరద చుట్టుముట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆ గ్రామం సమీపంలోకి వెళ్లి గ్రామస్తులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. బేల మండలం సాంగిడి, బెదోడా గ్రామాల అంచుల వరకు నీళ్లు రావడంతో పాటు గ్రామాలను మూడు వైపులా వరద నీరు చుట్టుముట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరోపక్క ప్రాణహిత నది సైతం ఉధృతంగా ప్రవహించడంతో కౌటాల తదితర మండలాల్లో ఈ నది బ్యాక్ వాటర్ కారణంగా పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి. ఆయా ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటున్నారు.

ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత..రాకపోకలకు అంతరాయం

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టుల్లోకి వరద నీరు అధికంగా రావడంతో దాదాపు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు ప్రస్తుతం 60వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోరాగా.. 18గేట్లు ఎత్తివేసి 75వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదిలేస్తున్నారు. దీంతో పాటు అడ, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు వదిలేయడంతో గుండివాగు మరింత ఉధృతంగా ప్రహిస్తోంది. వంతెనపై నుంచి నీరు పారడంతో సుమారు 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోస్రా- మలన్‌గొంది వద్ద బ్రిడ్జి తెగిపోయింది. మోతుగూడ- అప్పపెల్లి గ్రామాల మధ్య తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలేయడంతో సిద్దాపూర్ వాగు మరింత వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో నిర్మల్- కౌట్ల(కె) గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. నిర్మల్ పట్టణంలో పలు కాలనీల్లోకి వరద నీరు రావడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి కనిపిస్తోంది. మత్తడివాగు, సాత్నాల తదితర ప్రాజెక్టుల గేట్లు ఎత్తారు. పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పలు చోట్ల వంతెనలపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో ఎవరూ దాటకుండా అక్కడ పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశారు. అవసరమైన చోట్ల సహాయక చర్యలు చేపడుతున్నారు.


పెన్‌గంగ వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ


సాంగిడి గ్రామ సమీపంలో వరద నీరు


కడెం ప్రాజెక్టు వద్ద వరద పరిస్థితిని తెలుసుకుంటున్న నిర్మల్ కలెక్టర్

జిల్లాకు చేరిన పర్యావరణ పరిరక్షణ సైకిల్ యాత్ర



ఆదిలాబాద్‌టౌన్ : ప్రస్తుత కాలంలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని టెరిటోరియల్ ఆర్మీ మేజర్ అభయ్ జిత్ సింగ్ అన్నారు. టెరిటోరియల్ ఆర్మీ 75వ వసంతాలను పురస్కరించుకొని సియచిన్ గ్లేషియర్ నుంచి జూలై 30న చేపట్టిన సైకిల్ ర్యాలీ సోమవారం ఆదిలాబాద్‌కు చేరుకుంది. దీనికి ఎన్‌సీసీ కెప్టెన్ గాలి అశోక్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎన్‌సీసీ కెడెట్లతో ఆర్మీ అధికారులు సమావేశయ్యారు. సైకిల్ యాత్ర, ఉద్దేశం, ఆరోగ్యం, పర్యావరణం గురించి కెడెట్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా టెరిటోరియల్ ఆర్మీ మేజర్ అభయ్ జిత్ సింగ్ మాట్లాడుతూ టెరిటోరియల్ ఆర్మీ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకోని ఇందిరా పాయింట్ వరకు సైకిల్ ర్యాలీని చేపట్టామన్నారు. 55 రోజుల పాటు 5500 కిలోమీటర్ల సాగుతుందన్నారు. సునామీ కారణంగా ఇందిరా పాయింట్ నీటిలో మునిగిపోయిందన్నారు. స్కూబ డైవింగ్ చేసి అక్కడ భారతదేశ జెండాలను ఎగరవేస్తామన్నారు. అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఆరోగ్యం, పర్యావరణం గురించి వివరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ క్రమంలో పలుచోట్ల మొక్కలు కూడా నాటామని తెలిపారు. కార్యక్రమంలో టెరిటోరియల్ ఆర్మీ మేజర్ ఏఎస్ రవత్, ఎన్‌సీసీ సీనియర్ జేసీఓ భగీరథ్ రాం, ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల కేర్ టేకర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించడంలో ఎల్‌ఐసి అగ్రగామి



మంచిర్యాల : దేశవ్యాప్తంగా వివిధ రంగాల ప్రజలకు విశిష్ట సేవలతో భారతీయ జీవిత బీమా సంస్థ అగ్రగామిగా నిలిచిందని ఐడిబిఐ బ్యాంకు హెడ్ కె.రాఘవేంద్రరావు పేర్కొన్నారు. ఎల్‌ఐసి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో జరిగిన 68వ బీమా వారోత్సవాల ప్రారంభ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రమాద సందర్భాల్లో రెవెన్యూ సర్టిఫికెట్లు లేనప్పుడు సైతం స్థానిక సింగరేణి కార్మికుల క్లెయిముల చెల్లింపులు చేసిన ఎల్‌ఐసి ప్రజాసేవలో ముందుందని మంచిర్యాల చీఫ్ మేనేజర్ వి.విశ్వేశ్వర్ తెలిపారు. పాలసీదారులకు క్లెయిమ్‌ల చెల్లింపులో 98శాతం నెరవేరుస్తూ, ప్రపంచ స్థాయిలోనే ఎల్‌ఐసి మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు. పాలసీదారులకు విశిష్ట సేవలు అందించినందుకుగాను ఎల్‌ఐసి సంస్థ ఎన్నో అవార్డులను సొంతం చేసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల బ్రాంచి అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ సత్యప్రసాద్, అనిత, బ్రాంచి మేనేజర్ నందిగాం శ్రీనివాసరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ గోపతి మల్లేష్, నరేష్, సతీష్, ఏజెంట్లు రాజబాబురెడ్డి, పూర్ణచందర్, రాజేంద్ర ప్రసాద్, రామదాస్, తిరుపతిరెడ్డి, ఆర్.రాజేశం, రమేష్ బాబు, శివరంజన్, సీరాపాణి, నాగలక్ష్మి, హిమశ్రీ, రవీందర్, చరణ్, పలువురు ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్ : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత, హీరో పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని అంజనీపుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ముందుగా అభిమానులు అందరు కలిసి నటరాజ్ థియేటర్ వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ నటించిన గబ్బర్‌సింగ్ సినిమాను నటరాజ్ డీలక్స్ థియేటర్లో ప్రదర్శించడంతో సినిమాను వీక్షించారు. అంతకుముందు అభిమానులు పవన్ కళ్యాణ్ చేస్తున్న సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. తమ అభిమాన నటుడు చూపించిన సామాజిక సేవ మార్గంలో చురుగ్గా పాల్గొంటామని పేర్కొన్నారు. అనంతరం రిమ్స్‌లో సత్య సాయి ట్రస్ట్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించి కళావతి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ అనిల్, ఫాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జక్కుల కార్తీక్, అభిమానులు భీమ్‌సేనరెడ్డి, బాలశంకర్ కృష్ణ, విఠల్, అంకత్ కృష్ణ, సత్య మేకల, భూపతి, శ్రీనివాస్, వివేక్, సందీప్, వినయ్, సంతోష్, రవితేజ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

వాస్తవ లాభాలు ప్రకటించి 35శాతం వాటా ఇవ్వాలి

నస్పూర్: సింగరేణిలో 2023-24 వార్షిక లాభాలను ప్రకటించి కార్మికులకు 35శాతం వాటాని చెల్లించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో గని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 70.02 మిలియన్ల టన్నుల ఉత్పత్తి సాధించడం జరిగిందని, అయినా ఇప్పటి వరకు యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించలేదని విమర్శించారు. ఎస్ఆర్పీ ఓసీలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండి రమేష్, గడ్డం సుధాకర్, కందుల శంకర్, లక్ష్మీనారాయణ, రమేష్, పవన్, ఆర్కే5 గనిలో దుర్గం రవికుమార్ పాపిరెడ్డి, ఆర్కే6 గనిలో కేంద్ర చీఫ్ ఆర్గనైజ్ సెక్రెటరీ పొగాకు రమేష్, ఆర్గనైజ్ సెక్రెటరీ అన్వేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు పానుగంటి తిరుపతి, మల్లయ్య, సదానందం, శ్రీకాంత్, రవి, ఆర్‌కె 7 గనిలో బానోతు రాజు నాయక్, బిరుదు శ్రీనివాస్, సిద్ధం తిరుపతి, గద్దల వెంకటేష్, ఆర్కె న్యూటెక్ గనిలో కేంద్ర కమిటీ నాయకులు ఎండి లాల, ఉప్పల సంపత్, ఐకె 1ఏ, ఓసీ గనిలో రత్నాకర్‌రెడ్డి, గోపాల్, తిరుపతి, ఎస్ఆర్పీ-1 గనిలో పత్తిపాక రవిచంద్ర, మేడం తిరుపతి, బత్తుల రాజేశం, ఎస్ఆర్పీ-3 గనిలో గోపీనాయక్, సాదుల భాస్కర్, వెంకట్‌రెడ్డి, అల్లం రాజయ్య, సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు.

వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం



మందమర్రి : బేతస్థ వాలంటరీ ట్రస్టు, లిటరసి ఇండియా ట్రస్టు చెన్నై ఆర్థిక భాగస్వామ్యంతో సోమవారం వయోజన విద్యా కేంద్రాన్ని ప్రారంభించారు. శిక్షణ పొందిన టీచర్లు ప్రాజెక్ట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ రాజశేఖర్ చేతుల మీదుగా ప్రైమర్స్, స్లేట్స్, బ్లాక్ బోర్డ్స్, లైట్స్‌ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అక్షరజ్ఞానం లేక నేటికి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారన్నారు. అక్షర జ్ఞానం ఉంటే ఆరోగ్యం, పరిసరాలు, కుటుంబ జీవితంలో పెనుమార్పులు చోటు చేసుకోగలవని తెలిపారు. బెతెస్థ వాలంటీర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కె.ఆనంద్ మాట్లాడుతూ ప్రారంభించింది మొదలు 10నెలలు ముగిసే సరికి వయోజనులైన వారు అనర్గళంగా చదువగలరన్నారు. పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. సమావేశంలో శిక్షణ పొందిన టీచర్లు పాడిన మోటీవేషన్ పాటలు అందర్నీ ఆకర్శించాయి. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల ఫెలోషిప్ అధ్యక్షులు ఏలియా, జాయింట్ సెక్రటరీ ఎస్.విజయ్ కుమార్, ట్రెజరర్ సాల్మన్, లంబాడి కమ్యూనిటీ నెన్నెల మండల డీసీసీ సభ్యులు లావుడ్య రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాథమిక దశలో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

విద్యార్థులు ప్రాథమిక దశలోనే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్యలతో కలిసి రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేయబడిన సంచార గ్రంథాలయ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనంపై ఆసక్తి పెంచడం ద్వారా స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దవచ్చని, ఇందుకు గ్రంథాలయ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని, పుస్తకం పఠనం అలవాటు చేయడంతో తరగతి అభ్యాసన లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. పిల్లలకు చదివే నైపుణ్యం, అలవాటు పెంపొందించేందుకు రూమ్ టు రీడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతి విద్యా సంవత్సరం ఆగస్టు 15 నుండి సెప్టెంబర్ 8 వరకు పాఠశాల విద్యాశాఖ సమన్వయంతో రాష్ట్ర స్థాయి రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం మేక్ రూమ్ ఫర్ ఎర్లీ రీడింగ్, రీడ్ ఎ థాన్ ద్వారా 3 నుండి 8 సంవత్సరాల వయస్సు గల చిన్నారులలో చదివే నైపుణ్యం బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమంల చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ నెల 3న ఉదయం 11 గంటల నుండి 11.30 వరకు ప్రతి ప్రాథమిక పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రంలో డ్రాప్ ఎవ్రీథింగ్ అండ్ రీడ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, సంచార గ్రంథాలయ వాహనం జిల్లాలో సంచరిస్తూ ప్రజలకు చదవడం, పుస్తకాల వినియోగంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, సమగ్ర శిక్షణ సమన్వయకర్తలు కె.చౌదరి, ఎ.సత్యనారాయణమూర్తి, రూమ్ టు రీడ్ ఇండియా ప్రతినిధులు మధు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఆదిలాబాద్‌టౌన్ : కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ పేదల నడ్డివిరుస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. పార్టీ పిలుపు మేరకు నిత్యావసర ధరల తగ్గించాలని సెప్టెంబర్ 2 నుంచి 6 వరకు చేపట్టే నిరసనలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ధరలను అదుపు చేస్తామని చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ బడా వ్యాపారులకు అండగా ఉంటూ నిత్యావసర ధరలను విపరీతంగా పెంచిందన్నారు. అదానీ, అంబానీ ఆస్తుల పెంపకంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందే తప్ప పేదలకు అండగా నిలవలేదని విమర్శించారు. వారం రోజుల పాటు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు తెలియజేసేలా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు ఏక కాలంలో ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంటాల రాములు, కేశవ్, అరుణ్ కుమార్, దేవిదాస్, అమీనా బేగం పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ రూ.20 లక్షలు ఇవ్వాలి

మందమర్రి : 2016 నుండి రిటైర్డ్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ రూ.20లక్షలు ఇవ్వాలని హెచ్ఎంఎస్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ జె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం హెచ్ఎంఎస్ బ్రాంచ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఢిల్లీ హైకోర్టు ప్రభుత్వ ఉద్యోగులకు జనవరి 2016 నుండి 20లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని పార్లమెంటులో బిల్లు ఆమోదం పొంది గెజిట్ వచ్చినప్పటికీ సింగరేణిలో ఇవ్వడం లేదన్నారు. 2018 నుండి ఇవ్వడానికి ఏఐటీయూసీ, బిఎంఎస్, సీఐటీయూ సంతకాలు చేసినా హెచ్ఎంఎస్ సంతకం చేయలేదన్నారు. ఏదేమైనా డబ్ల్యూసిఎల్‌లో ఇప్పటికే 20 లక్షల గ్రాడ్యుటీని ఇప్పించడం జరిగిందని తెలిపారు. సింగరేణిలో కూడా గ్రాట్యుటీ కంట్రోలింగ్ అథారిటీ ద్వారా 2016 నుండి హైకోర్టు ఢిల్లీ సూచనల మేరకు 20లక్షల గ్రాట్యుటీ ఇప్పించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. 2016 నుండి 20లక్షల గ్రాట్యుటీ రాని రిటైర్డ్ కార్మికులు హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్‌ని సంప్రదించాలని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ది సుదర్శన్, యాకూబ్, చొప్పరి రామస్వామి పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-నస్పూర్

ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ అన్నారు. సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమగ్ర కులగణన చేపట్టి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి రిజర్వేషన్లను 42శాతం పెంచుతామని కామారెడ్డిలో బిసి గర్జన సభ పెట్టి బిసి డిక్లరేషన్ పేరుతో హామీ ఇచ్చిందన్నారు. అంతేగాకుండా తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా పొందుపర్చిందని, అనుకున్నట్టుగానే బీసీల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే సమగ్ర కులగణన చేపట్టాలని, జనవరి 13న ఢిల్లీలో రాహుల్ గాంధీని జాతీయ అధ్యక్షుడు జూజల శ్రీనివాస్‌గౌడ్ కలిసి విన్నవించారని తెలిపారు. ఇదే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వెంటనే బీసీ కుల గణన చేపట్టాలని, రూ.150 కోట్ల బడ్జెట్ కూడా కేటాయించిందన్నారు. ఇంతలో పార్లమెంటు ఎన్నికలు రావడంతో కులగణన ప్రక్రియ ఆగిపోయిందని, పార్లమెంటు ఎన్నికల తర్వాత కులగణన ప్రక్రియ ప్రారంభిస్తారని బీసీలు ఆశిస్తే మూలిగే నక్కమీద తాటిపడు పడ్డట్లు కులగణన ప్రక్రియకు చాలా సమయం తీసుకుంటుందని, తాము గ్రామ పంచాయతి ఎన్నికలకు నిర్వహిస్తామని ప్రభుత్వం డొంక తిరుగుడు మాటలు చెబుతుందని ఆరోపించారు. 13 కోట్ల జనాభా ఉన్న బీహార్ రాష్ట్రంలో నెల రోజుల్లో కులగణన చేస్తే 4కోట్లు ఉన్న తెలంగాణలో 15 రోజులు సరిపోదా? అని ప్రశ్నించారు.

వెంటనే కులగణన చేపట్టి 42శాతం రిజర్వేషన్లు అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.నీలకంఠేశ్వరరావు, బీసీ నాయకులు మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ వర్ధంతి వేడుకలు



ఆదిలాబాద్‌టౌన్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ చేసిన సేవలను కొనియాడుతూ నినాదాలు చేశారు. జిల్లాకు రిమ్స్ ఆస్పత్రిని ఇచ్చి పేద రోజులకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చిన ఘనత దివంగత నేత వైఎస్‌కు దక్కుతుందని పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ అన్నారు. ఆరోగ్య పరంగా పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యశ్రీ, 108 వాహనాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ఆయన పని చేశారన్నారు. కార్యకర్తలు కూడా వైఎస్ ఆశయ సాధన దిశగా రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేయడానికి కంకణ బద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జహీర్ రంజానీ, కలాల శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మణ్, నాయకులు షకీల్, ఖయ్యుం, శ్రీలేఖ, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సిరికొండలో భారీ వర్షం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. రిమ్మ నుంచి తుమ్మల్‌పాడ్ గ్రామానికి వెళ్లే మార్గంలో అలాగే మండల కేంద్రం నుంచి వాయిపేట్ వెళ్లే మార్గం మధ్యలో వాగులు పొంగి పొర్లి ప్రవహించడమే కాక రోడ్డు మొత్తం కోతకు గురయ్యాయి. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎవరైనా అనారోగ్యానికి గురైతే అంబులెన్స్ సైతం వెళ్లలేని దుస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్లను బాగు



చేయాలని స్థానికులు కోరారు. వర్షాల వల్ల ఆటంకాలను ఎదుర్కొన్న గ్రామాలను మండల ఇన్‌చార్జీ తహసీల్దార్ ఉపేందర్, ఇచ్చోడ సీఐ భీమేష్, ఆదిలాబాద్ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ పరిశీలించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



న్యాయ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జిల్లా జడ్జీ చాంబర్‌లో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లోని కేసులు రాజీ పడటం ద్వారా ఇద్దరు గెలిచి సమస్య పరిష్కారం అవుతాయన్నారు. కక్షిదారులకు కోర్టు ఖర్చులకు తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ సారి 3550 కేసులను పోలీసులు, బ్యాంక్, ఇన్సూరెన్స్ అధికారులతో సమావేశం నిర్వహించి గుర్తించామన్నారు. ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కక్షిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పొలాల అమావాస్య పండుగ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం పొలాల అమావాస్య పండుగను ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఎడ్లను అందంగా అలంకరించి, డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. హనుమాన్ ఆలయాల చుట్టూ తిప్పి ఇంటిల్లిపాది పూజలు చేశారు. మట్టితో ప్రత్యేకంగా తయారు చేసిన ఎడ్లకు, వ్యవసాయ పని ముట్లకు నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు బాగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని మొక్కుకున్నట్లు రైతులు తెలిపారు.

తలమడుగు : ప్రతి సంవత్సరం శ్రావణ మాసం నెలలో పొలాల అమావాస్య సందర్భంగా మండలంలో పోలాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా రైతులు తమ ఎద్దులను సమీప వాగుల్లో శుభ్రంగా కడిగి అనంతరం మోతుకు నారతో చేసిన గటార్లను ఎద్దుల కొమ్ములకు కట్టి పత్రిఆకులు అగర్బత్తులతో అలంకరిస్తారు. కొమ్ములకు ప్రత్యేక ఆకర్షణీయంగా వివిధ రకాల బెగడలు, బెలూన్‌లు, ఎద్దుల శరీరంపై జూలు వేసి ఎద్దులను రైతులు అందంగా తీర్చిదిద్దుతారు. గ్రామంలోని ఎద్దులను డప్పు చప్పుల మధ్య గ్రామంలో గల పోచమ్మ, హనుమాన్ మందిరం చుట్టూ తిప్పుతారు. పార్వతి పతి హర హర మహాదేవ్ అంటూ నినాదాలు చేస్తూ, రైతులు తమ ఎద్దులను ఇంటి వద్దకు తీసుకెళ్లి కాళ్ల కడిగి మొక్కిన అనంతరం నైవేద్యం సమర్పిస్తారు. పోలాల పండుగ ఒకే రోజు రావడంతో అన్ని గ్రామాలలో రైతులు పోలాల పండుగను ఘనంగా జరుపుకున్నారు.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు పార్డి(బి), పల్సి, సోనారి, గోడపూర్, పార్డి(కె)తో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం పొలాల పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలో ఉన్న రైతులు తమ తమ ఎద్దులను శుభ్రం చేసి అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి, గ్రామాల్లో ఉన్న ఆలయాల చుట్టూ హర హర మహాదేవ శంభో శంకర్ అంటూ 5 ప్రదక్షిణలు చేసి ఇంటికి తీసుకువచ్చి, హారతులిచ్చి ఇంటి వద్ద తయారు చేసిన పిండి వంటలు ఎద్దులకు నైవేద్యాలు సమర్పించారు.

తాంసి : పొలాల అమావాస్య పండుగ పురస్కరించుకొని సోమవారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో పోలాల పండుగను రైతన్నలు ఘనంగా నిర్వహించారు. ఒకరోజు ముందు ఎద్దులకు మెడలకు నూనె పసుపు రాసి బరుల్ దించి, ఉదయాన్నే గ్రామాల సమీపంలో గల వాగులలో ఎడ్లను శుబ్రంగా కడిగి, వివిధ రకాల రంగులను కొమ్ములకు దిద్ది, వాటిపై జూల్లు వేసి ఎంతో అందగా అలకరించి, డప్పు వాయిద్యాలతో గ్రామ దేవతలుగా పిలిచే హనుమాన్, పోచ్చమ్మ మందిరం చుట్టూ తింపి ఇండ్లలోకి తీసుకోవచ్చి, రైతన్నలు కుటుంబ సమేతంగా నైవేద్యాలను సమర్పించారు.

నార్నూర్ : నార్నూర్, గాదిగూడ మండల కేంద్రాలతో పాటు గిరిజన ఆదివాసీ గ్రామాల్లో సోమవారం పొలాల అమావాస్యను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎడ్లను రకరకాలుగా అలంకరించి, హనుమాన్ ఆలయం ముందర ప్రదిక్షణలు చేయించారు. రకరకాల పిండి వంటల చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పటేళ్లు, నాయక్‌లు, కారోబారిలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : ఆదిలాబాద్, మావల మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో పొలాల పండగను ఘనంగా నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండి, రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర దొరుకాలని కోరుకున్నారు. సాంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ కాలంతో పాటు ముందుకు సాగాలని కోరుకున్నారు.

ముధోల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం పొలాల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. ఎద్దులను అందంగా ముస్తాబు చేశారు. డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ఎద్దులకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఎడ్లు లేని రైతులు మట్టి ఎడ్ల ప్రతిమలకు పూజలు చేశారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం పొలాల అమావాస్య పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే ఎద్దులను చక్కగా అలంకరించి, గ్రామాల్లోని విధుల గుండా ఊరేగిస్తూ, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



సిరికొండ



తలమడుగు



కుభీర్



ఆదిలాబాద్ రూరల్



ముధోల్

చెరువు పనుల్లో అసంపూర్తిగా మరమ్మతులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ముత్నూర్ త్రివేణి సంగమం చెరువు గత సంవత్సరం భారీ వర్షాలకు మత్తడి ఉప్పొంగిపొర్లడంతో ప్రధాన బీటీ రోడ్డు కోతకు గురైంది. అప్పట్లో ఆర్ అండ్ బి శాఖాధికారులు గుంతలను పూడ్చేసి రాకపోకలను కొనసాగించారు. ఐతే ఈ రోడ్డు మీదకు అలుగు నీళ్ల రాకుండా తాత్కాలికంగా మొరం పోయాలని మైనర్ ఇరిగేషన్ శాఖకు జిల్లా ఉన్నతాధికారులు నివేదికను తయారు చేసి పంపాలని ఆదేశించారు. ఆ శాఖ అధికారులు రూ.4లక్షల వ్యయంతో జూన్ నెలలో హడావిడిగా మొరం పోసి చేతులు దులుపుకున్నారు. ఈ పనులను మైనర్ ఇరిగేషన్ అధికారులే చేశారని ఆరోపణలు వినిపించాయి. అధికారులు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా, తూతూ మంత్రంగా చేపట్టారు. మళ్లి ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు మొరం మొత్తం కొట్టుకుపోయి. మున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. దీంతో నాలుగు లక్షలతో శాశ్వత పనులు చేపట్టాల్సి ఉండగా, తాత్కాలిక పనులు చేప్పడంతో పరిస్థితి మొదటికి వచ్చిందని, ప్రజాధనం వృధా చేస్తున్నారని పలువురు ఆరోపించారు.

అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తు పెండింగ్ లేకుండా చూడాలని, కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తు, వాటిని పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని, అదనపు కలెక్టర్ శ్యామలదేవి సూచించారు. ఆర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొత్తం 35 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మట్టి ఎద్దుల ప్రతిమల అందజేత



నవతెలంగాణ-భైంసా

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు మట్టి ఎద్దుల ప్రతిమలను లోకేశ్వరం బీజేపీ నాయకులు పోలాల అమావాస్య పండుగ సందర్భంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం, జల కాలుష్యం కాకుండా వినాయక చవితి, పోలాల అమావాస్య ఉత్సవాల్లో ప్రతి ఇంటా మట్టి ప్రతిమలను వాడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ లోకేశ్వరం మండలం అధ్యక్షులు జయసాగర్‌రావు, భాగపూర్ మాజీ సర్పంచ్ లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మి నారాయణ, నాయకులు సొలంకి భీమ్‌రావు, ఫిరోజ్ ఖాన్ ఉన్నారు.

కరెంట్ మిటర్ లేకుంటే దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

కరెంటు మీటర్ లేని పేదవారు ఇంకా ఎవరైనా ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సోమవారం విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17నుంచి అర్హులందరికీ జీరో కరెంటు బిల్లు కొరకై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా కొత్త కరెంట్ మీటర్ బిగించడానికి కేవలం రూ.825 రూపాయలకే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. ఆసక్తి గల వారు మీసేవకు వెళ్లాల్సిన పనిలేదనీ, చలాన్ కట్టాల్సిన అవసరం లేకుండా కేవలం ఒక ఆధార్ కార్డు తీసుకోని బీపీఎల్ కుటుంబం సభ్యులు మాకు కొత్త మీటర్ కావాలనుకుంటే విద్యుత్ శాఖ కార్యాలయం వారు విద్యుత్ కనెక్షన్ సదుపాయం కల్పిస్తారన్నారు. పూర్తి వివరాల కోసం దగ్గరలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

నవతెలంగాణ-బోథ్

మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన సిరిసే వంశీ అక్రమంగా తరలిస్తున్న గంజాయిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్లపల్లి కంఠేగావ్ సమీపంలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో మర్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు మోటార్ సైకిల్‌పై మూటను తరలిస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు ఆయనను పట్టుకొని మూటను అనుమానంతో తనిఖీ చేశారు. అందులో ఐదు కిలోల గంజాయి ఉన్నట్టు తెలిపారు. అలాగే యువకుడిని విచారించగా కుమురంభీమ్ జిల్లా నుంచి ఒక కిలోకు రూ.1500 కమీషన్ మీద తరలిస్తున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలని సామాజికవేత్త ముడుపు మౌనిష్‌రెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కాలనీవాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని టీచర్స్ కాలనిలో రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారయారన్నారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విన్నవించారు. ఆయన వెంట కాలనీవాసులు ఓమయ్య, విఠల్, సుకుమార్, ప్రణయ్ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని జందాపూర్ గ్రామ మున్నూరుకాపు ఉద్యోగ, యువజన సంఘాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ మున్నూరు కాపు యువజన సంఘం అధ్యక్షులుగా మార్శెట్టి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా కుంట శివను, కోశాధికారిగా నాగుల నారాయణను ఎన్నుకున్నారు. ఉద్యోగ సంఘం అధ్యక్షులుగా పసుల ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా ఉష్కమల్ల మోహన్, కోశాధికారిగా మార్శెట్టి అంజును ఎన్నుకున్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ చెట్లు..తొలగించిన పోలీసులు



నవతెలంగాణ-ఖానాపూర్

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఖానాపూర్ పట్టణంలోని కుమురంభీం చౌరస్తా, తర్లపాడు రహదారి మధ్యలో సోమవారం ఉదయం చెట్లు విరిగిపడ్డాయి. దీంతో సమాచారం అందుకున్న ఖానాపూర్ సీఐ సైదారావు సిబ్బందితో కలిసి వెళ్లి విరిగిపడ్డ చెట్లను తొలగించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేసి, ఇప్పటి వరకు ఎన్ని కాల్స్ వచ్చాయని ఆరా తీశారు. తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షం కురుస్తుందని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, వేరే చోటికి తరలించాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టులను పరిశీలిస్తూ ఉండాలని, పోలీస్ అండ్ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న సందర్భంగా ప్రజలు అత్యవసరమైతేనే తప్పా బయటకు రావద్దని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది పాత భవనాలు, ఇండ్లు, గోడలు వర్షానికి కూలిపోయే దశలో ఉన్న వారిని గుర్తించి, ముందు జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఓపెన్ బావులలో క్లోరినేషన్ చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలనీ తెలిపారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతీ రోజూ నీటిని వేడి చేసి తాగాలని, వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వాగులు వంకలు పొంగిపొర్లుతున్న సందర్భం లో ప్రజలు వాటిని దాటరాదని కోరారు. ప్రాజెక్టులు ఓవర్ లోడ్ అవుతే వెంటనే గేట్లు ఎత్తివేయాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అవసరమైతే విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా, డివిజన్, మండల్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ , విద్యుత్‌శాఖలు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారం అందివ్వాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 18004251939 సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఏఓ రామిరెడ్డి, సూపరింటెండెంట్ వర్ణ, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన



నవతెలంగాణ-తలమడుగు

జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన అన్నారు. సోమవారం మండలంలోని లింగి గ్రామంలో ఒకరికి డెంగ్యూ జ్వరం రావడంతో అక్కడ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. లింగి గ్రామానికి చెందిన ఒకరికి డెంగ్యూ జ్వరం బారిన పడ్డట్లు తెలిపారు. వైద్య పరీక్షలు డెంగ్యూ వ్యాధి అని తేలడంతో మిగతా వారికి వ్యాధులు సోక కుండా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి వ్యాధుల సోకిన వెంటనే గ్రామీణ ప్రజలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇంటి వద్ద ఎలాంటి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అంతేకాకుండా గ్రామాలో గల రక్షిత నీటి ట్యాంకును వారానికి మూడుసార్లు శుభ్రపచాలన్నారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల గుండా పర్యటించి, పారిశుధ్యన్ని సంపూర్ణంగా నిర్మించాలని ఆదేశించారు. ఇందులో ఎంపీడీఓ చంద్రశేఖర్, వైద్యాధికారి డాక్టర్ హరీశ్ వైద్య సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కప్పర్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కప్పర్ల గ్రామానికి చెందిన బొజ్జ రవీందర్(35) సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు తాంసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శివరాం సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతునికి తల్లితో పాటు బార్య ఉంది. మృతికి గల కారణాలు తెలియలేదు.

అక్రమంగా తరలిస్తున్న ఏడు ఆవుల పట్టివేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండల కేంద్రంలో నుండి అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తున్న ఏడు ఆవులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర అప్పపల్లికి చింతలమానేపల్లి మండల కేంద్రం, డోర్పల్లి, కొమ్ముగూడ గ్రామాలకు చెందిన ఉందిరి సందీప్, ముంజం కార్ సంతోష్, మౌల్కర్ సోమ, అక్రమంగా ఎలాంటి చలానా లేకుండా తరలిస్తున్నారు. విషయం తెలియడంతో వాహనాన్ని తనిఖీ చేయగా ఏడు ఆవులున్నాయి. బొలెరో వాహనాన్ని సీజ్ చేసి, పలువురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాలనలో ప్రత్యేక ముద్ర వేసిన గొప్ప వ్యక్తి వైఎస్ఆర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలనలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసిన గొప్ప వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన 108, ఫీజు రియంబర్స్‌మెంట్ ఇలాంటి పథకాలు పేద ప్రజలకు నేటికీ ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అటువంటి గొప్ప నేతను కోల్పోవడం కాంగ్రెస్‌కు లోటేనని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కన్న, నిజాం, బీసీ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్, శంకర్, బాలేష్, మిలింద్, తానాజీ పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు

- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ


ఆసిఫాబాద్


వాంకిడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులకు ముఖ్యమైన పొలాల అమావాస్య పండగ వేడుకలు ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. రైతుల పొలం పనులు పూర్తయిన నేపథ్యంలో ఎడ్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయాల వద్దకు తీసుకువెళ్లారు. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఎక్కువగా కనిపించే వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఉదయం నుండి పెద్ద ఎత్తున మట్టితో తయారు చేసిన ఎడ్లు ఇతర వస్తువులను అమ్ముతున్న వ్యాపారులతో రహదారులు కిక్కిరిసిపోయాయి. పొలాల అమావాస్యని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్ నుండి గాంధీ చౌక్ వరకు పెద్ద ఎత్తున ఎడ్ల ర్యాలీ నిర్వహించారు. దీనిలో జిల్లా కేంద్రంలోని రైతులతో పాటు పల్లెల్లోని రైతులు పెద్ద ఎత్తున తమ ఎడ్లతో హాజరయ్యారు.

బెజ్జూరు : మండలంలో సోమవారం పోలాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులు ఎడ్లను పూలు, రంగులతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎడ్లకు నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామదేవతల ఆలయాల చుట్టూ ఎడ్లతో రైతులు ప్రదక్షణలు చేశారు.

వాంకిడి : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం పొలాల పండుగను రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన పొలాల పండుగ సందర్భంగా ఎద్దులను ముస్తాబు చేసి హనుమాన్ ఆలయాలకు తీసుకెళ్లి ప్రదక్షణలు చేయించి పోచమ్మ దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తమ తమ ఇండ్లలో బసవన్నలకు పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

కౌటాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం పోలాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతులతో ఆరుగాలం వెన్నంటి ఉండే ఎద్దులను రైతులు రంగురంగులతో అలంకరించి గ్రామ దేవత ఊరు పోచమ్మ హనుమాన్ ఆలయల చుట్టూ తిరుగుతూ ఎద్దులను రైతులు పూజించి ఎద్దులను శివునిగా బావించి మొక్కులు తీర్చుకున్నారు.

ఈపీ ఆపరేటర్ల ఉద్యోగోన్నతుల్లో అన్యాయం

నవతెలంగాణ-రెబ్బెన

ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల్లో అన్యాయం జరిగిందనిసింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈపీ ఆపరేటర్స్ ప్రమోషన్లలో బెల్లంపల్లి రీజియన్ శ్రీరాంపూర్ నుండి గోలేటి వరకు ఇచ్చిన ప్రమోషన్లలో అన్యాయం జరిగిందన్నారు. తక్కువ మందికి ప్రమోషన్ ఇచ్చారన్నారు. ఆపరేటర్లందరికీ వేకెన్సీతో నిమిత్తం లేకుండా అందరికీ టైం బాండ్ ప్రకారం ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సముద్రాల ఆనంద్, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డి, పుట్ట అంజయ్య ఆపరేటర్స్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నవతెలంగాణ-కౌటాల

సమస్యలు పరిష్కరించాలని తలోడీ గ్రామ యువకులు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీఓకు అందజేశారు. ఈ సందర్భంగా కుంచాల రమేష్ మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, విష జ్వరాలతో ఇంటింటికి ఇద్దరు చొప్పున మంచం పట్టారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. వీధి దీపాలు లేవని, క్లోరినేషన్ మర్చిపోయారని, గ్రామపంచాయతీ ట్రాక్టర్ ఉనప్పటికీ వారానికి ఒక్కరోజు కూడా చెత్తను తీసివేయడానికి రావడం లేదని ఆరోపించారు. అధికారులు వచ్చిన చూసిన దాఖలు లేవన్నారు. గతంలో సర్పంచుకు సైతం ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ ధర్నాలో తలోడి గ్రామ యువకులు పాల్గొన్నారు.

సింగరేణి లాభాల వాటా 35 శాతం ప్రకటించాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఖైరగూడ ఓపెన్ కాస్ట్‌లో లాభాల వాటా 35 శాతం లాభాల వాటా కార్మికులకు ఇవ్వాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు కోరారు. సంఘం కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం బెల్లంపల్లి ఏరియా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఖైరగూడ ఓపెన్ కాస్ట్ గని మేనేజర్ జె.రమేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, ఓరం కిరణ్, మొగిలయ్య, మోరే సత్యనారాయణ, బొరిగం శ్రీనివాస్, అజీమ్, రవీందర్, దుంపల బాబు, ఇప్ప శంకర్, రాజు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

పల్లెల్లో లోపించిన పారిశుధ్యం

- గ్రామాలకు జ్వరం...వృద్ధి చెందుతున్న దోమలు
- రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు
- పట్టించుకోని అధికారులు

దేశానికి పట్టుకొమ్మలుగా భావించే పల్లెలకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా జ్వరం పట్టుకుంది. విష జ్వరాలు, డెంగ్యూ వంటి రోగాలతో మరణాలు సంబవిస్తున్నాయి. పచ్చగా, ఆరోగ్యంగా ఉండాల్సిన పల్లెలు పారిశుధ్య లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రస్తుతం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల కాలపరిమితి ముగియడంతో మండలాలు, గ్రామాలకు ప్రత్యేక అధికారులను కేటాయించారు. వారురారు సమస్య తెలుసుకోరని ప్రజలు అంటున్నారు. మండలంలో పారిశుధ్యం లోపించడం కారణంగా వ్యాధులు ప్రబలుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి అంబేద్కర్ చౌరస్తా అస్తవ్యస్తంగా మారింది. జనావాసాల్లో మురుగునీరు నిలవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.


చింతలమానేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దుస్థితి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

పారిశుధ్య పనులు చేపట్టడంలో ఆలసత్వం, పంచాయతీలను పట్టించుకోని ప్రత్యేక అధికారుల కారణంగా మండల వ్యాప్తంగా దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు, డెంగ్యూ విజృంభిస్తుంది. ఇటీవల స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని కూడా నామమాత్రంగా చేపట్టడంతో ఎక్కడికక్కడ మురుగు నీరు విలుస్తోంది. చెత్త కుప్పలు పేరుకుపోయాయి. ఫలితంగా దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో విష జ్వరాలు తీవ్రస్థాయిలో ప్రబలుతున్నాయి. దోమల నివారణ చర్యలు లేకపోవడతో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి విషజ్వరాల బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల విషజ్వరాలతో కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన పదవ తరగతి విద్యార్థి జడే పూజ(16), అదే గ్రామానికి చెందిన బోయిరే కాళిదాస్ గంటల వ్యవధిలో మృతి చెందిన విషయ తెలిసిందే. అయిన అధికారుల్లో చలనం లేదని మండల వాసులు ఆరోపిస్తున్నారు. ఇంకెన్నీ మరణాలు జరిగితే స్పందిస్తారని ప్రశ్నిస్తున్నారు.

పట్టించుకోని ప్రత్యేకాధికారులు...

గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధిక పాలన మొదలైంది. ప్రస్తుతం జిల్లాలోని 15 మండలాలకు 13 మంది జిల్లా స్థాయి అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా కొనసాగుతున్నారు. అలాగే పంజాయతీలకు 125 మంది అధికారులు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ అధికారులు ప్రత్యేకాధికారి ప్రత్యేక అధికారులకు సంయుక్త చెక్ పవర్ ఇచ్చారు. 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ రూ.5.88 కోట్ల వరకు జిల్లాలకు విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వారం రోజుల క్రితం పంచాయతీ ఖజానాల్లో జనాభా ప్రాతిపదికన జమ చేశామని పేర్కొన్నారు. అయిన పారిశుధ్య కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు.

గాడితప్పిన ప్రత్యేక పాలన...

ఓ వైపు పల్లెలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. వర్షాలు కురిసి ఇండ్లలో వరద నీరు వచ్చి చేరుతుంది. కనీసం సమస్యలు, వ్యాధుల నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పల్లె పాలన పూర్తిగా గాడితప్పింది. వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించడంతో పాటు పట్టణాలు, పల్లెల్లోని మురుగునీటి కుంటలు, ఓపెన్ ప్లాట్లు వరద నీటితో నిండాయి. అంతర్గత రహదరులు బురదతో అస్తవ్యస్తంగా మారాయి. ప్రతి పంచాయతిలో 16 బస్తాలు బ్లీచింగ్ పౌడర్ అవసరం ఉండగా, అధికారులు కేవలం 4 బస్తా చొప్పున మాత్రమే పంపిణీ చేశారు. ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరడంతో, దోమల నివారకు ప్రస్తుతం బ్లీచింగ్ పౌడర్ చల్లడమే ఒకే ఒక్క మార్గం. అయితే పంచాయతీలకు 4 బస్తాలు సరిపోవడం లేదని సిబ్బంది చెబుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.





బురదమయంగా రోడ్లు

రౌత్ తిరుపతి, చింతలమానేపల్లి



మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రోడ్డంతా బురదగా మారి గుంతలో వర్షపు రోజుల తరబడి నీరు నిలుస్తోంది. రోడ్డుపై వెళ్లాలంటే భయంగా ఉంది. వర్షాల కారణంగా రెండు గంటలు కరెంట్ లేకపోతే దోమలతో సహవాసం తప్పడం లేదు. ఫలితంగా విష జ్వరాలు వచ్చి అవస్థలు పడుతున్నారు. అధికారులు నిత్యం పారిశుధ్య పనులు పట్టాలి.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

కోట ప్రసాద్, ఎంపీడీఓ, చింతలమానేపల్లి

పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చార్యలు తీసుకుంటున్నాం. పారిశుధ్యం లోపించకుండా చూస్తాం. మండల పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశ సమీక్ష ఏర్పాటు చేస్తున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్వచ్ఛత పనులు చేపట్టాలని సూచిస్తున్నాం. పారిశుధ్యం లోపిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

రోగాలులు ప్రబతులున్నాయి

జాడి వైజయంత, చింతలమానేపల్లి



అంబేద్కర్ చౌరస్తా సమీపంలో నివాసం ఉంటున్నాం. పదిహేను రోజుల నుంచి తీవ్ర జ్వరంతో ఉంది. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లాను. వైద్యులు పరీక్షించి మలేరియా, టాయిఫాయిడ్‌తో పాటు బ్లడ్ ఇన్ఫెక్షన్ ఉందని చెప్పారు. జ్వరం తగ్గినా మోకాళ్ల నొప్పులు, కాళ్ళ వాపులు తగ్గడం లేదు. దీనికి ప్రధాన కారణం దోమలేనని వైద్యులు చెప్పారు.

ఉప్పొంగిన పెద్దవాగు

- బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పంట పొలాలు
- పరిశీలించిన కలెక్టర్, అధికారులు


కౌటాల : నీట మునిగిన పంటల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-కౌటాల

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత పెన్‌గంగా ఉప్పొంగడంతో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తుంది. పెన్‌గంగా బ్యాక్ వాటర్‌తో పార్డీ తాటిపెల్లి, వీర్దండి, గుండాయిపేట్ గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. విర్దండి గ్రామానికి చెందిన రైతులు మిర్చి పంట నాలుగు రోజులుగా వేసుకున్నారు. సోమవారం బ్యాక్ వాటర్‌తో మిర్చి పంట మునిగి పోవడంతో ఒక్కొక్క రైతు నాలుగు నుండి ఐదు ఎకరాల వరకు నీటిలో మునిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి నీట మునిగిన పంటలను సర్వే చేయించి నష్టపరిహారం అందించేలా చూడాలని కోరుతున్నారు.

పంటలను పరిశలించిన కలెక్టర్

వీర్దండిలో నీట మునిగి తెలుతున్న పంట పొలాలను సోమవారం కలెక్టర్ వెంకటేష్‌ధోత్రే పరిశీలించారు. భారీ వర్షాలకు ప్రాణహిత, వార్ధ నదులు ఉప్పొంగి ప్రవహించడంతో బ్యాక్ వాటర్ చేరి పంటలు నీట మునిగిన రైతులకు అండగా ఉంటామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే భరోసా ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులను నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. పరివాహక ప్రాంతాల్లో ప్రతి ఏట పంటలు వేసుకొని నష్టపోతున్నామని కలెక్టర్ దృష్టికి రైతులు తెచ్చారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ స్థానిక రైతుల సమస్యలు వివరించారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో వ్యవసాయాన్ని నమ్ముకుని బతికే రైతులు, సొంత భూములు లేక కౌలుకు తీసుకొని సాగు



చేస్తున్నారని, వారికి కూడా మేలు చేసేందుకు సర్వే చేయించి పంట నష్టం జాబితాలో చోటు కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇందులో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య తహసీల్దార్ పుష్పాలత, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఎస్సై మధుకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : అడ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో పెద్దవాగు ఉధృతి పెరిగింది. పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని కమ్మర్‌గాం, గుండెపెల్లి గ్రామాల మధ్యలో పెద్దవాగు బ్లాక్ వాటర్ రోడ్డుపైకి వచ్చి బెజ్జూరు, పెంచికల్‌పేట్ మండల కేంద్రాలకు రాకపోకలు స్తంభించాయి. పెద్దవాగు ఉప్పొంగడంతో పరివాహక ప్రాంతాల పొలాలు, చేన్లు నీట మునిగిపోయాయి.


పెంచికల్‌పేట్ : ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

బీసీ గణన తర్వాత ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి బీసీ గర్జనలో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. రానున్న రోజుల్లో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ గణన తర్వాత నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీల గణన కోసం బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ప్రస్తుతం గణనకు సమయం లేదని స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావడం సరైన విధానం కాదన్నారు. వెంటనే కులగణన పూర్తిచేసి 42 శాతం రిజర్వేషన్‌తో ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, ఉపాధ్యక్షుడు బాలేష్, రైతు విభాగం అధ్యక్షుడు వైరాగడే మారుతి పటేల్, రైతు విభాగం జిల్లాప్రదాన కార్యదర్శి గడ్డల శంకర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు లోబడే లవ్ కుమార్, మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోషే శంకర్, మాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్నులే మారుతి, రైతు విభాగం మండల అధ్యక్షుడు మదూకర్, సహకార సంఘం వైస్ చైర్మెన్ రుకుం ప్రహ్లాద్, నాయకులు రవికాంత్, శ్రీనివాస్ చారి, లింగు, శ్రీకాంత్, వైద్య సంతోష్ కుమార్, కవల్కర్ నారాయణ, షెండే నాందేవ్ పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు
- ఉద్యోగాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వైద్య శాఖలో నూతనంగా ఎంపికైన వారు బాధ్యతతో విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని వైద్య శాఖలో ఖాళీగా ఉన్న 15 విభాగాల్లోనే 64 పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన నిర్వహించిన భర్తీ ప్రక్రియలో జిల్లా వైద్యాధికారి తుకారాం భట్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రవికృష్ణ, సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ చెన్నకేశవులుతో కలిసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శాఖలో విధులను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. 15 విభాగాల్లో 64 పోస్టులు ఖాళీగా ఉండగా వాటి భర్తీ కోసం వివిధ దశల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేసుకుని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. ఒక్కో పోస్టుకు ఇద్దరిని ఎంపిక చేసామని మెరిట్ అభ్యర్థి రాకపోతే తర్వాత అభ్యర్థికి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. అయితే పీడియాట్రిక్ విభాగానికి ఒకటే దరఖాస్తు వచ్చిందని ఆ వ్యక్తి కూడా అర్హతలు కలిగి లేడని తిరస్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బెజ్జూరు

సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభిమానులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పవన్ కళ్యాణ్ నిండు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలని దేవున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనసేన విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మరియాల వినీత్ ఆధ్వర్యంలో జనసేన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పేదలకు పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సాయితేజ, కోవా రాహుల్, కార్తీక్, రాజు, వైరాగడే రమేష్, వైరాగడే కృష్ణ, రాజశేఖర్, యశ్వంత్, సాయి ప్రసాద్, శంకర్, రాహుల్, తిరుపతి జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా పొలాల అమావాస్య



నవతెలంగాణ-జన్నారం

నేతకాని కులస్తులు అత్యంత వైభవంగా సాంస్కృతిక సాంప్రదాయాలను అనుసరిస్తూ పాటించే పండగ పొలాల అమావాస్యను సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న నేతకాని కులస్తులు ఘనంగా నిర్వహించారు. పూర్వీకులు తాతలు ముత్తాతల పేరు మీద ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం బసవన్నలకు నైవేద్యం సమర్పించి దీక్షను విరమించారు. బసవన్నలను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. నేతకాని కులస్తుల కుల గురువులకు వారి పెద్దలను తలచుకొని బియ్యం పప్పు, ఇతర దినుసులను ఇస్తూ, కానుకలు ముట్ట చెప్తారు. అలాగే డబ్బులతో అయ్యవార్లకు పాదాభివందనాలు చేస్తూ, రాత్రి వేళల్లో ఇంటి తడకలను కట్టెలతో కొడుతూ కీడే మకోడే మారుబ్ జై గొ మారుతి అంటూ, ఇంట్లో ఉన్న దోమలను ఇతర చెడు కీటకాలను తరిమేస్తారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

4

మంగళవారం | సెప్టెంబర్ 03, 2024 | www.navatelangana.com

ఎల్లంపల్లికి భారీగా వరద

- 32 గేట్లు ఎత్తి నీటి విడుదల

నవతెలంగాణ-హాజీపూర్



ఎగువన కురుస్తున భారీ వర్షాలకు తోడు కడెం, శ్రీరాంసాగర్ గేట్ల ఎత్తివేతతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 3లక్షల క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో ఉండగా 32 గేట్లు ఎత్తి రెండు లక్షల అరవై వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. అధికారులు ఉదయం ఎస్ఆర్ఎస్పీ గేట్లు ఎత్తడంతో ఆ నీరు సోమవారం రాత్రి వరకు ఎల్లంపల్లి చేరే అవకాశం ఉన్నందున మరిన్ని గేట్లు ఎత్తి వేసేందుకు అధికారులు అప్రమత్తం అయ్యారు.

పొంగిపొర్లుతున్న గోదావరి

- పంట పొలాలను ముంచెత్తిన వరద నీరు
- జాగ్రత్త చర్యలు చేపట్టిన అధికారులు

నవతెలంగాణ-జైపూర్

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుండి వచ్చి చేరుతున్న వరద నీటితో వేలాల శివారులో గోదావరి పొంగిపొర్లుతోంది. సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు గోదావరి వరద ఎప్పటికప్పుడు పెరుగుతుండటంతో సమీప పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. వరి, పత్తి పంట పొలాల్లో వరద నీరు వచ్చి చేరుతోంది. గ్రామానికి చెందిన ఇప్పలపల్లి ఓసేపు, పంచిక శంకరయ్య, గొర్రె ఐలక్క, పంచిక భూమయ్య, కౌటం బాలు, మీసాల రాజమల్లు, ఇప్పలపల్లి నాగరాజు, భాస్కర్ పంట పొలాలను గోదావరి వరద పూర్తిగా ముంచెత్తింది. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పెద్ద ఎత్తున పంటలు నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాల గ్రామ శివారులో సాగు చేసిన సుమారు 40 ఎకరాల వరి పొలం, 80 ఎకరాల పత్తి చేనులోకి వరద వచ్చి చేరింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గెట్లు ఎత్తి వరద నీటిని గోదావరి నదిలోకి వదలడంతో వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. గంట గంటకు వరద ప్రవాహం పెరుగుతుండటంతో గోదావరి నది వైపు ప్రజలు వెల్లకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. పుష్కరఘాట్ వద్ద స్థానిక ఎస్ఐ శ్రీధర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



వరద నీటిలో మునిగిన పత్తి చేను

ఏకధాటి వర్షాలతో కూలుతున్న గోడలు

మండల పరిధిలో షెట్‌పల్లి గ్రామంలో దాసరి లస్మ ఇంటి గోడలు పడిపోగా కోటగిరి రాజేశం, పల్లేర్ల రాజన్న ఇంటి ప్రహరి గోడలు పాక్షింగా పడిపోయినట్లు తెలిపారు. అదేవిధంగా టేకుమట్ల గ్రామంలో చొప్ప పోశమ్మ, ఆడువాల వెంకటేశ్ ఇంటి గోడలు పాక్షికంగా పడిపోయినట్లు స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి తెలిపారు.

జన్నారం : మండలంలోని కలమడుగు వంతెన వద్ద గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు 18 గేట్లను అధికారులు ఎత్తి వేసి గోదావరిలోకి 2,48,378 క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు. అలాగే శ్రీరామ్ సాగర్ వరద గేట్లను కూడా ఎత్తి నీటిని పెద్ద ఎత్తున గోదావరిలోకి వదలడంతో, గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. మండలంలో గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలైన కలమడుగు, బాదంపల్లి, ధర్మారం చింతగూడ, రోటిగూడ, తపాల్‌పూర్, తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎస్ఐ రాజ వర్ధన్, ఎంపీడీఓ శశికళ ఆ గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. మండలంలోని రోటి గూడ గ్రామంలో లోలెవెల్ వంతెన పైనుంచి వరద నీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితులను సమీక్షించారు. మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీలో నీరు రావడంతో వారిని అప్రమత్తం చేశారు. ప్రస్తుతం మండలంలో ఎలాంటి ఘటనలు జరగలేదని మండలం ప్రశాంతంగా ఉందని అధికారులు తెలిపారు. ఆర్ఐ భానుచందర్ ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జలంధర్, పొనకల్ ఈఓ రాహుల్ పాల్గొన్నారు.



జైపూర్ : పార్వతి(సుందిళ్ల) బ్యారేజ్ నుండి దిగువకు వదులుతున్న వరద నీరు

పంచాయతీలలో వరద సహాయక చర్యలు

తాండూర్ : తాండూరు మండలంలోని, బోయపల్లి, ఎంవీకే త్రీ, రేచిని, కిష్టంపేట గ్రామపంచాయతీలోని గ్రామాలను ఎంపీడీఓ శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ సందర్శించి వరద సహాయక చర్యలు చేపట్టారు. బోయపల్లి ఎస్సీ కాలనీలో మురికి కాలువలో చెత్త కూరుకుపోయి అంతర్గత రోడ్లపై నీరు నిలవడంతో సహాయక చర్యలు చేపట్టారు. తంగళ్ళపల్లి ఈద్గా వద్ద గల డ్రైనేజీ కాలువలో పిచ్చి మొక్కలు మొలిసి ఇండ్లలోనికి వరద నీరు చేరడంతో జేసీబీ ద్వారా డ్రైనేజీ కాలువలో పూడిక తీయించారు.



జైపూర్ : పంటపొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వనజారెడ్డి



జన్నారం : వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ



తాండూర్‌లో వరద సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

మాతా శిశు కేద్రానికి వరద ముప్ప

- బాలింతలు, శిశువులను ప్రధాన ఆస్పత్రికి తరలింపు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని మాత శిశు కేంద్రానికి వరద ముప్పు ఉండడంతో అధికారులు మాత శిశు కేంద్రంలోని గర్భిణులు, బాలింతలు, శిశువులను స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అంబులెన్స్, ఆర్టీసీ బస్సుల్లో ఆస్పత్రి సామగ్రీని తరలించారు. ఆదివారం విస్తారంగా కురిసిన వర్షాలతో మంచిర్యాల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. సోమవారం ఉదయానికల్లా ఇండ్లలోకి వరద నీరు చేరడంతో కాలనీ వాసులు ఇండ్లు కాళీ చేసి ఇంటి సామన్‌లతో సహా పునరావాస కేంద్రలకు తరలి వెళ్లారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు లోతట్టు ప్రాంతాలను సందర్శించి కాలని వాసుల రక్షణ చర్యలు చేపట్టారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఎప్పటికి అప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. పునరావాసకేంద్రాలు, జిల్లా ప్రజల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు. వరద తీవ్రతపై ఎలాంటి ఆందోళనలు చెందవద్దు అంటూ ప్రజలకు సూచనలు అందించారు.

పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

మూడు రోజులుగా మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలలో వర్షాలు కురుస్తున్నందున పంటల సంరక్షణ కోసం రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ ఒక ప్రకటలో పేర్కొన్నారు. రాబోవు రెండు రోజులలో వాతావరణ శాఖ సమాచారం మేరకు మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు. రైతులు భారీ వర్షాలకు ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలనుతెలియజేశారు. మీరు నిలిచిన మొక్కజొన్న ప్రత్తి మొక్కల సాళ్ళ మధ్య నీరు నిలవకుండా బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పత్తి మొగ్గ వేయు దశలో ఉంది. పంట అధిక వర్షాల వలన పత్తి మొక్కలు పసుపు రంగులోనికి మారే అవకాశం ఉందని, అధిగమించడానికి మొక్క వయసును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలని తెలిపారు. మొక్క ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలన్నారు. అధిక తేమ వల్ల పత్తి మొక్కలకు వేరుకుళ్ళు తెగులు సోకడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని, దీని నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజం లీటర్ నీటికి కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ నేలపై వారం వ్యవధిలో రెండు సార్లు పోయాలని సూచించారు. అధిక వర్షాల కారణంగా కందిలో ఫైటోఫ్తోర ఎండు తెగులు ఆశించడానికి అవకాశం ఉంది. పంట పొలాలలో మురుగు నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. అధిక వర్షాల కారణంగా పొలంలో నీరు నిలిచి ఉన్నట్లైతే వెంటనే మురుగు నీటిని తీసేయాలని తెలిపారు. కందిలో ఎండు తెగులు సోకడం గమనించినట్లైతే 3 గ్రా. మాంకోజెబ్ 75 శాతం డబ్ల్యూపీ, 2.గ్రా. మెటలాక్సిల్ 25 శాతం డబ్ల్యుపీ లీటరు నీటికి కలిపి వర్షాలు తగ్గిన తరువాత మొక్క మొదలు తడిచేలా పోయాలన్నారు.

ప్రమాదకరంగా కొత్తపేట లోలెవెల్ వంతెన



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని కొత్తపేట గ్రామానికి వెళ్ళే రహదారి భారీ వర్షాల నేపథ్యంలో లోలెవెల్ బ్రిడ్జి పూర్తిగా చెడిపోయింది. రోడ్డు పరిస్థితి ప్రమాద భరితంగా మారింది. రెండు, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా మండలానికి వెళ్లాల్సిన దారి తెగిపోయింది. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలోని కొత్తపేట గ్రామ నుంచి కవ్వాల్, జన్నారం వెళ్ళే ప్రధాన రహదారి తెగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ఈ దారి గుండా వాహనాలు నడుస్తూ ఉంటాయి. వర్షాకాలం వచ్చింది అంటే చాలు ఆ గ్రామానికి వెళ్ళడానికి పొరుగు గ్రామాల వారికి కూడా కష్టం అవుతుంది. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ రోడ్డు పరిస్థితి ఇలాగే కొనసాగుతుంది. 108 వాహనం కూడా పోలేని దుస్థితి నెలకొంది ఆటోలలో వెళ్లే గర్భిణీ స్త్రీలకు చాల ఇబ్బంది ఏర్పడుతుంది. ప్రభుత్వాలు మారుతున్న కూడా ఈ రోడ్డుకు తగిన పరిష్కారం చేయట్లేదు. ఏ నాయకులు వచ్చిన ఈ బ్రిడ్జి పూర్తి చేసే బాధ్యత మాది అని కొబ్బరికాయలు కొట్టి వెళ్ళడం తప్ప చేసింది ఐతే ఏమి లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పై అధికారులు అలాగే ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు స్పందించి తక్షణమే ఈ దారికి బ్రిడ్జి కట్టించి మెరుగు పరచాలని యూత్ సభ్యులు, తొట్ల శ్రీకాంత్ యాదవ్, సంకోజ్ అరుణ్, బలవత్తుల వినీత్, పూదరి మహేష్ గ్రామస్తులు కోరుతున్నారు.

ముంపు ప్రమాదమేమీ లేదు..!

- ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం
- ప్రజలు నిర్భయంగా ఉండచ్చు
- ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్

నవతెలంగాణ-హజీపూర్

మంచిర్యాల నియోజకవర్గానికి ముంపు సమస్య లేదని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం హాజీపూర్ మండలంలోని గుడిపేట్ వద్ద గల ఎల్లంపల్లి ప్రాజెక్టు 32 గేట్లు ఎత్తిన సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే, డీసీపీ భాస్కర్ లు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు. ఎవరయినా వరదలో ఇబ్బందులు ఎదుర్కొంటే సంబంధిత టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలు చేపడ్తారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగువ నుండి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద నీరు వస్తుండడంతో ఎల్లంపల్లికి వరద తాకిడి ఎక్కువైందన్నారు. దీంతో 6.5 లక్షల క్యూసెక్కుల నీటిని 32 గేట్లు ఎత్తి దిగువ గోదావరికి వదులుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికైతే ఎలాంటి ముంపు లేదన్నారు. కడెం నుంచి వచ్చే నీటిని పూర్తిగా వదులుతున్నట్లు తెలిపారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేసినట్లు అక్కడి అధికారులు తెలపడంతో మరింత అప్రమత్తం చేసి గేట్లు 5 మీటర్ల ఎత్తు లేపి ఉంచామన్నరు. ఎస్ఆర్ఎస్పీ నీరు సోమవారం రాత్రి వరకు ఎల్లంపల్లికి చేరే అవకాశం ఉన్నందున జిల్లా కేంద్రంలోని గోదావరి ఒడ్డున నిర్మించిన మాతా శిశు ఆస్పత్రిలోని పిల్లా తల్లులను జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి, ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. తాము అధికారంలో లేనప్పుడే కాంగ్రెస్ కార్యకర్తలు వరద సహాయక చర్యలో పాల్గొనడం, ఆ అనుభవంతో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడకూడ ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు ఎవరు కూడా అధైర్య పడవద్దన్నారు. డీసీపీ ఎగ్గని భాస్కర్ మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు, స్థానిక గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఈఈ స్వామి, డీఈఈ బుచ్చి బాబు, శ్యామ్ బాబు, మాజీ ఎంపీటీసీలు బాలరాజు, బాపు, కార్ణమామిడి, పద్దనపల్లి పీఏసీఎస్ చైర్మన్‌లు కోటే సత్తయ్య, రామారావు, మంచిర్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాసమల్ల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



వైఎస్ఆర్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-జన్నారం

పేద ప్రజల మనసుల్లో గుడికట్టుకొని రాజకీయాలకే కొత్త హంగులు తెచ్చి తనదైన ముద్రవేసుకున్న మహా నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, ఏనుగు సుభాష్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మహ్మద్ రియాజుద్దీన్ అన్నారు. సోమవారం దివంగత ముఖ్య మంత్రి వైఎస్ఆర్ 15వ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రిలో రోగులకు పండ్లను బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి పేదలకు ఆరోగ్యశ్రీ ప్రధాతగా ఫీజు రియంబర్స్మెంట్‌తో ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లుగా ఇంజనీర్లుగా పోలీసులుగా తీర్చిన మహానుభావుడు అన్నారు. పేదలకు వారు చేసిన సేవలను కొనియాడారు. అతని ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫసి ఉల్లా, ముత్యం రాజన్న, రియాసత్ అలీ, మోసిన్ ఖాన్, నోముల రాజ్ కుమార్, రాజాక్, లకావత్, తిరుపతి, ఇమ్రాన్ షేక్, గంగన్న, ఖలీం పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య, కోకన్వీనర్ కడారుల నర్సయ్య అన్నారు. సోమవారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నాకు మండల బీసీ సంఘ నాయకులు వెళ్లారు. ముందుగా మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకపోతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దేశ జనాభాలో బీసీ కులస్తులు 50 శాతానికిపైగా ఉన్నా రిజర్వేషన్లు అందడం లేదని వాపోయారు. తమకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేంతవరకు ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలసాని శ్రీనివాస్‌గౌడ్, సంతోష్, ఒల్లాల నర్సగౌడ్, లక్ష్మీనారాయణ, కేప నరసింహులు, అయిన రవి, కొండపల్లి మహేష్, భూమాచారి, వెంబడి సత్యం, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

80 శాతం ఉద్యోగాలు ప్రభావిత గ్రామాల వారికి ఇవ్వాలి

- సింగరేణి, ఓబీ కంపెనీలను ఆదేశించిన హైకోర్టు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి ఓపన్‌కాస్ట్ గనుల అనుబంధ ఓబీ కంపెనీ ఉద్యోగాల్లో ప్రభావిత ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. రామగుండం రీజియన్ పరిధికి చెందిన మద్దెల దినేష్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా న్యాయవాదుల వాదనలపై న్యాయమూర్తి స్పందించారు. సింగరేణి ఓపన్‌కాస్ట్ గనుల అనుబంద ఓబీ కంపెనీలలో 80 శాతం ఉద్యోగాలు స్థానిక, ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని న్యాయస్థానం సూచించింది. 8 వారాల లోపు సింగరేణికి అనుబంధంగా ఉన్న అన్ని ఓబీ కంపెనీలలో 80 శాతం ఉద్యోగాలు స్థానిక, ప్రభావిత గ్రామాల వారికి అవకాశం కల్పించాలని న్యాయస్థానం సూచించింది. హైకోర్టు ఆదేశాలతో ఓపన్‌కాస్ట్ ప్రభావిత గ్రామాలకు చెందిన యువకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని గత కొంత కాలంగా స్థానికులు, ప్రభావిత గ్రామాల వారు డిమాండ్ చేస్తున్నారు. ఇందారం ఓపన్‌కాస్ట్ గని ఏర్పాటుతో వేల ఎకరాల భూమిని నష్టపోయి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమయ్యామని ప్రభావిత గ్రామాల వారు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులకు కాకుండా స్థానికేతరులైన ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

మస్టర్లు పూర్తి చేస్తేనే ఇంక్రిమెంట్స్, బెనిఫిట్స్

- మందమర్రి ఏరియా జీఎం దేవేందర్



నవతెలంగాణ-మందమర్రి

కార్మికులు మస్టర్లు 190 పూర్తి చేస్తేనే ఇంక్రిమెంట్స్, బెనిఫిట్స్ లభిస్తాయని, లేని పక్షంలో నిలిపివేయడం జరుగుతుందని మందమర్రి జీఎం దేవేందర్ యువ కార్మికుల్ని హెచ్చరించారు. సోమవారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆగష్టులో ఏరియాలో సాధించిన బొగ్గు ఉత్పత్తి ఉత్పాధకత వివరాలను జీఎం దేవేందర్ వెల్లడించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 251500 టన్నులకు గాను 190008 టన్నుల బొగ్గు ఉత్పత్తితో 76 శాతం వెలికి తీసిందని వెల్లడించారు. వర్షాలు కురిసినప్పటికి ఆర్కె ఓసీపీ గని 162 శాతం శాతం బొగ్గు ఉత్పత్తి సాదించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా ఆర్కె ఓసీపి ఉద్యోగులను జీఎం అభినందించారు. ఏరియాలో ఏప్రిల్ నుంచి ఆగష్టు వరకు 80 శాతం ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి శాతం తగ్గడానికి కారణం గైర్హాజరు ఉద్యోగులని తెలిపారు. వారసత్వ ఉద్యోగాల ద్వారా వచ్చిన యువ కార్మికుల వలన గైర్హాజరు శాతం 27 శాతం ఉందన్నారు. మొదటి షిఫ్ట్‌లో విధులకు హాజరవుతూ రాత్రి షిఫ్ట్‌ల్లో 50 శాతం మాత్రమే హాజరు అవుతున్నారని తెలిపారు. ప్రతీ ఉద్యోగి కచ్చితంగా 190 మస్టర్లు పూర్తి చేయాలని అన్నారు. తమ భవిష్యత్తుని కంపెనీ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రక్షణ సూత్రాలను పాటిస్తూ 100శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఈ అండ్ ఎం డీజీఎం వెంకటరమణ, ఐఈడీ డీజీఎం రాజన్న, ఎఫ్ అండ్ ఏడిజీఎం ఆర్వి ఎస్ఆర్కె ప్రసాద్, ఇన్‌చార్జి పర్సనల్ మేనేజర్ మైత్రయ బందు, డివై పీఎం కమ్యూనికేషన్, సేవ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ఎండీ ఆసిఫ్, ఎస్ఈ సివిల్ జయప్రకాష్ పాల్గొన్నారు.

కత్తి కోడి పందెలపై దాడి

- ఎనిమి మందిపై కేసు నమోదు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని ఆడేపల్లి గ్రామంలో కత్తి కోడి పందెం నిర్వహిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు ఎస్సై ఇస్లావత్ నరేష్ దాడి నిర్వహించారు. 8 మందిని పట్టుకోని వారివద్ద నుండి ఐదు కోడీ పుంజులు, ఐదు కత్తులు, రూ.2120 స్వాధీనం చేసుకున్నారు. కోడిపే శంకర్, బండి గంగారాం, బెమ్మిడి గంగారాం, యటకారి రాములు, టేకం మల్లేష్, గట్ల హార్జయ్య, శబ్బని మొండయ్య, అన్నం శ్రీనివాస్ కత్తి కోడి పందెం ఆడుతున్నారని తమకు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మిని పరామర్శించిన జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై కోలుకొని హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మిని జిల్లా నాయకులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. ఎమ్మెల్యేని పరామర్శించిన వారిలో మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, కాంట్రాక్టర్ అబ్దుల్లా, నాయకులు ఎండీ జాకీర్ హుస్సేన్, అమర్ బీన్ అహ్మద్ పాల్గొన్నారు.

మొబైల్ రీడింగ్ లైబ్రరీతో ఉపయోగం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజానికి విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచేందుకు మొబైల్ రీడింగ్ లైబ్రరీ ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో రీడింగ్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా మొబైల్ రీడింగ్ లైబ్రరీ వాహనాన్ని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 15 మండలాలలో ఈ మొబైల్ రీడింగ్ లైబ్రరీ ద్వారా సమాజానికి, పిల్లలకు చదవడం ప్రాముఖ్యతను తెలియజేయడం, 3 నుంచి 8 సంవత్సరాల పిల్లలకు ప్రారంభ దశలో పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేయడం జరుగుతుందని అన్నారు. రకరకాల పుస్తకాలు, పోస్టర్లు, స్టోరీ కార్డ్స్, బిగ్ బుక్స్, ప్రింట్ రిచ్ ఎన్విరాన్మెంట్ పుస్తకాలున్నాయని, పిల్లలను ప్రీ లెర్నింగ్ ద్వారా, టీచర్స్, తల్లితండ్రులను అనుసంధానం చేయడం ద్వారా వారిలో నేర్చుకొనే అలవాటును పెంపొందించవచ్చని తెలిపారు. ఈ వాహనం జిల్లాలో 7 రోజుల పాటు గ్రామ గ్రామాన తిరుగుతుందని, వందలాది పుస్తకాలు ఈ వాహనంలో అందుబాటులో ఉంటాయని, అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్, క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, రూమ్ టు రీడ్ ఇండియా జిల్లా లీడ్ జెన్నిఫర్ పాల్గొన్నారు.

రైతులు తమ వివరాలను అందించాలి

నవతెలంగాణ-బెజ్జూర్

రెండు లక్షల లోపు రుణాలు తీసుకొని రుణమాఫీ కానీ రైతులు తమ వివరాలు అందించాలని ఏఈఓ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రుణమాఫీ జాబితాలో పేర్లు ఉండి రుణమాఫీ కానీ రైతులు తమ వివరాలను ధ్రువీకరణ పత్రాన్ని అందించి ఫోటో దిగాలని తెలిపారు. వివరాల అందించిన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చెల్లిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాలుగు వరుసల రహదారిలో డీబీఎల్ నిర్లక్ష్యం

- అండర్‌పాస్ వద్ద నిలిచిన నీరు



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో డీబీఎల్ కంపెనీ నిర్మించిన నాలుగు వరుసల రహదారిలో కమాన చౌరస్తా, బ్యాంకు చౌరస్తా వద్ద నిర్మించిన అండర్‌పాస్‌ల వద్ద నిర్మాణం సరిగా లేకపోవడంతో రోడ్డుపై నుండి నీరు పారతోంది. వర్షాపు నీరు అండర్‌పాస్ నుండి బయటకు వెళ్లటనికి దారి లేకపోవడంతో అండర్‌పాస్ వద్దనే నీరు నిలిచి ప్రజలు, వాహనదారులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడి తరచుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఎవరు కూడా పట్టించుకోకపోవడంతోనే నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం కూడా అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కమాన అండర్‌పాస్ వద్ద మరమ్మత్తులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా పండగలు జరుపుకోవాలి

నవతెలంగాణ-బెజ్జూర్

పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై విక్రం సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో గణేష్ నవరాత్రి సందర్భంగా పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ నవరాత్రుల సందర్భంగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణేష్ మండపాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముస్లీంలు ఈద్ మిలాద్ నబి పండగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పొలాల అమావాస్య వేడుకలను జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రైతులు బసవన్నలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దస్నాపూర్ నుంచి బసవన్నలతో పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ప్రదర్శన నిర్వహించారు. గాంధీ చౌక్‌లోని అంకమ రాజు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్ బాలేష్ గౌడ్, బీజేపీ నాయకులు కాండ్రే విశాల్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమేష్ రైతులు పాల్గొన్నారు

దహెగాం : మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం పొలాల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. రైతులు తమతమ ఎడ్లను కడిగి వివిధ రకాల వస్తువులతో అలంకరించారు. అనంతరం ఎద్దులకు నైవేద్యం పెట్టి, మంగళ హారతులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆరుగాలం కష్టాల్లో ఎంతో సహకరించిన ఎద్దుల పండుగతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

వాన ఆగింది...వరద మిగిలింది

- తెగిన బ్రిడ్జీలు..నిలిచిన రాకపోకలు
- వరద ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన
- కొనసాగుతున్న ప్రాజెక్టుల నీటి విడుదల



తెగిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా శని, ఆదివారాలు మండలాల్లో నమోదైన వర్షం సోమవారం కొంత శాంతించింది. సోమవారం ఏజెన్సీ మండలాల్లో మాత్రమే అక్కడక్కడ వర్షం కురియగ మిగతా మండలాల్లో వర్షం తక్కువగా నమోదైంది. వాతావరణ శాఖ భారీ వర్ష సూచన నేపథ్యంలో కొంత వర్షాలు శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

తెగిన బ్రిడ్జీలు నిలిచిన రాకపోకలు

ఆదివారం సాయంత్రం నుండి భారీ వర్షం నమోదు కావడంతో మండలంలోని మాలన్ గొంది వెళ్లే ప్రధాన రహదారిపై బ్రిడ్జీ తెగిపోయింది. మోతుగూడ నుండి అప్పపెల్లి వెళ్లే దారిలో తాత్కాలిక బ్రిడ్జీ కొట్టుకుపోయింది. గుండివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనితో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వరద ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

ఆసిఫాబాద్ మండలంలోని వరద ప్రాంతాల్లో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పర్యటించారు. తుంపల్లి, మొరంవాగు వద్ద పరిస్థితిని పరిశీలించినంతరం మాలన్ గొంది వద్ద తెగిన బ్రిడ్జిని పరిశీలించి వరద ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించడంతో పాటు వెంటనే మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రాజెక్టుల నీటి విడుదల

రెండు రోజులుగా కొనసాగుతున్న కుమురం భీం, వట్టివాగు ప్రాజెక్టుల నీటి విడుదల సోమవారం పెరిగింది. కుమురం భీం ప్రాజెక్టు నుండి ఆదివారం అర్ధరాత్రి ఐదు గేట్ల ద్వారా 43 వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదిలిన అధికారులు సోమవారం సాయంత్రం నాటికి పదివేల క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టు ద్వారా ఆదివారం అర్ధరాత్రి 14000 క్యూసెక్కులన్నిటిని కిందికి వదిలిన అధికారులు సోమవారం సాయంత్రం నాటికి మూడు గేట్ల ద్వారా 10,080 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.



అప్పపెల్లి తాత్కాలిక బ్రిడ్జి తెగడంతో ప్రజల కష్టాలు

పీహెచ్‌సీకి తాళం.. ఆగ్రహించిన అదనపు కలెక్టర్

- సస్పెండ్ చేయాలంటూ డీఎంహెచ్‌ఓకు ఆదేశం



పీహెచ్‌సీకి తాళం వేసి ఉండడాన్ని గమనిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-దహెగాం

వర్ష కాలం సీజన్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యులు అందుబాటులో ఉండాలని సీఎం నుంచి కలెక్టర్ వరకు వైద్యులకు సూచిస్తున్నారు. కానీ మండలంలోని వైద్యాధికారులకు మాత్రం అవి పట్టడం లేదు. పీహెచ్‌సీకి తాళం వేసి సొంత సెలవు ప్రకటించుకున్నారు. ఇదే క్రమంలో భారీ వర్షాల నేపథ్యంలో వరదల పరిస్థితులను పరిశీలించేందుకు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ రాగా ఆయనకు ఇక్కడ తాళం వేసి ఉండడం చూసి విస్తుండిపోయారు. పేద ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి ప్రాణాలను కాపాడాల్సిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం స్వయంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) ఎదుట బయట పడింది. లక్షల్లో జీతాలు తీసుకొని ప్రజలకు సేవ చేసే వృత్తిలో ఉండి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ కనీసం ఆస్పత్రిలో తిరగకుండా తాళం వేసి ఉండడంపై సీరియస్ అయ్యారు. వెంటనే జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి ఆస్పత్రి సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలోనే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పని తనంపైన నవతెలంగాణ పలు కథనాలను ప్రచురించింది. అప్పట్లో అధికారులు పట్టించుకోలేదు. దీంతో స్వయంగా సోమవారం జిల్లా అదనపు కలెక్టరే పర్యవేక్షణకు వచ్చిన వైద్య సిబ్బంది కనీసం తాళం తీయలేదంటే వారి పనితీరును అర్థం చేసుకోవచ్చు. ఇదే కాకుండా మండలంలోని మరికొన్ని శాఖల్లో సైతం సిబ్బంది నిర్లక్ష్యం రోజురోజుకు పెరిగిపోతుంది. అనంతరం ముంపు గ్రామమైన పెసరగుంట గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. ఎగువన కురిసిన భారీ వర్షాల కారణంగా పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుందని, పెసరగుంట గ్రామానికి ముంపు పొంచి ఉండడంతో గ్రామస్తులందరూ బీబ్రా గ్రామంలో గల రైతు వేదికలో ఉండాలని సూచించారు. అనంతరం పెద్దవాగు వద్ద గల పెంచికల్‌పేట్ వంతెనను పరిశీలించారు. అప్రోచ్ రోడ్డు వద్ద ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండి ప్రయాణించాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేందర్, డిప్యూటీ తహసీల్దార్ లలిత, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నాందేవ్ పాల్గొన్నారు.

పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పండుగలను మతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వర్ రావు, కాసబోయిన సురేష్, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, శాంతి కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్ ఉల్ నబి పండుగలను మతసామరస్యంతో జిల్లాలో శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. శాంతి కమిటీ సభ్యులు పండుగలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుత వాతావరణంలో ఘనంగా జరుపుకునే విధంగా కృషి చేయాలని తెలిపారు. వినాయక చవితి మండపాల వద్ద నిర్వాహకులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మున్సిపల్ సంబంధిత అధికారులు ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం రోజున పోలీసు శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనం ప్రాంతంలో ఎలాంటి ఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లు, క్రేన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జనం రోజున మద్యం దుకాణాలు మూసి ఉంచాలని, గ్రామాలలో చెరువుల వద్ద పూర్తిస్థాయిలో రక్షణ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రహదారులను గుంతలను పూడ్చే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విశ్వకర్మ లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. విశ్వకర్మ పథకం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులు, విషయ నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో అర్హులైన లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ పథకంలో భాగంగా చేతివృత్తుల వారు 2,223 మంది దరఖాస్తు చేసుకున్నారని, 698 మందిని శిక్షణకు పంపించడం జరిగిందని, మిగతా 1,393 దరఖాస్తులు గ్రామపంచాయతీ పరిధిలో పెండింగ్‌లో ఉన్నందున పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని, సంబంధిత అధికారులు, విషయ నిపుణులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మేషన్ వర్క్, టైలరింగ్, బార్బర్ పనుల వారికి శిక్షణకు ఏర్పాట్లు చేయాలని, టైలరింగ్ శిక్షణకు ఉట్నూర్‌లో కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలోని దరఖాస్తులను వారం రోజులలోగా పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి వివరాలను జిల్లా ఎంపిక కమిటీకి సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, లీడ్ డిస్టిక్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, కమిటీ సభ్యులు విజయ్, శ్రీశైలం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



శాంతికమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి : అదనపు కలెక్టర్



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

భారీ వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం పెంచికల్‌పేట్, దహెగాం వంతెన వద్ద పెద్దవాగు ఉధృతిని పరిశీలించారు. పెద్దవాగు వరద ముంపునకు గురయ్యే పంటలను పరిశీలించాలని, పెంచికల్‌పేట్ - బొంబాయిగూడ ప్రధాన రహదారిలో ఉచ్చ మల్లెవాగు-పెద్దవాగు వరద ముంపుకు గురైన పంటలను పరిశీలించారు. అంతకుముందు పోతెపెల్లి గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన భవనానికి మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికీ వచ్చిన నిధులతో పూర్తిస్థాయిలో మరమ్మత్తులు నిర్వహించాలన్నారు. గ్రామ ప్రజలు పలు సమస్యలను అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు. మొట్లగూడ గ్రామంలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అడిషనల్ కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఆల్బర్ట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, ఏపీఎం కోనయ్య, ఏపీఓ సతీష్, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని గుంటూరు కాలనీ వద్ద ఒక ఇంటిలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందినీ అదుపులోకి తీసుకున్నామని సీఐ తత్తూరు శంకరయ్య తెలిపారు. సమాచారం మేరకు దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి రూ.43 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో ఎస్సై దీకొండ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ రైతు కూలీ చౌదరి రమేష్ ఇటీవల పిడుగుపాటుతో మరణించగా బాధిత కుటుంబానికి పెందోర్ శ్యాంరావు సేవా సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.5300 నగదు ఆర్థిక సాయాన్ని అందించారు. సోమవారం బాధితుని భార్య సుమిత్రబాయికి గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పెందూర్ శ్రీనివాస్, పెందూర్ వినేష్, పెందూర్ ఆనందరావు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, గ్రామ పటేల్ వాడై సోనేరావు, మాలీ సంఘం నాయకులు సెండే నారాయణ, మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య, మాలీ యూత్ సభ్యులు వాడై సుభాష్, మండోరే లక్ష్మణ్, తిరుపతి, రవి, శంకర్, సేవా సమితి సహాయకులు ఉప్పుల సాయిరాం ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-వాంకిడి

మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మహమ్మద్ రియాజ్ అలీ అన్నారు. రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కుమురం భీం ప్రాజెక్టు గేట్లను ఎత్తిన కారణంగా పెద్దవాగు, చిక్లివాగు, నవెదరి, గుండాల చెరువు, చొప్పన్‌గూడ చెరువు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న ఇంటిలో ప్రజలు ఉండకూడదని, వాగులు, వంకలవైపు పశువులను మేపడానికి వెళ్లకూడదన్నారు. ఏ సమస్య ఉన్న కార్యదర్శులు, పోలీసులకు, తహసీల్దార్ నెంబర్లు 942481143, 6305696406కు సమాచారం అందించాలని కోరారు.

రెబ్బెన : రెండు రోజులు గా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మరియు కుమురం భీం ప్రాజెక్టు, వట్టివాగుల గేట్లు ఎత్తివేసినా కారణంగా పెద్దవాగు పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు. ఎలాంటి సమస్య ఉన కంట్రోల్ రూమ్ నెంబర్లు 9347940516, 9676954260ను సంప్రదించాలన్నారు.

ఉద్యానవన పంట రైతులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల ఉద్యానవన రైతులు జాగ్రత్త వహించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వెంకటేశం అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్, మిర్చి, టమాట లాంటి ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు పంటల పట్ల జాగ్రత్తలు తీసుకొని తగు మందులు వాడాలని సూచించారు. నీరు నిలువ ఉన్న పొలాలలో పంట మొదల వద్ద నీరు నిలవకుండా చూడాలని, నిలువ ఉన్న నీటిని కాలువల ద్వారా మళ్లించాలన్నారు. నీరు తొలగించిన అనంతరం ఒక లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రామ్ కార్బన్ కలిపి ద్రావణం తయారు చేసుకొని ఆ ద్రావణాన్ని చెట్ల మొదల్ల వద్ద వేయాలన్నారు. పంట జాగ్రత్త సమాచారం, సూచనలకు కొరకు ఉద్యానవన అధికారులను సంప్రదించాలని సూచించారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

నవతెలంగాణ-వాంకిడి

గణేష్ నవరాత్రులను దృష్టిలో ఉంచుకొని వాంకిడి పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్ఐ ప్రశాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలని, ఇందుకు కోసం ముందుగా నిర్వాహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ, ఎత్తు, ఏర్పాటు చేసుకున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ తదితర సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ఫోన్ కాల్స్ సైట్ ద్వారా పూర్తి వివరాలు నమోదుచేసుకొని రిజిష్టర్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. రాత్రివేళల్లో మండపాల వద్ద పెద్దపెద్ద శబ్ధాలతో డీజేలు పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దని, డీజేలకు అనుమతిలేదని, మండపంలో ఎన్ని అడుగుల విగ్రహం పెడుతున్నారు, ఎన్ని రోజులు పూజ చేసి ఎక్కడ నిమజ్జనం చేస్తారు అనే పూర్తి వివరాలు పోలీస్‌స్టేషన్‌లో తెలిపి అనుమతి తీసుకోవాలన్నారు.

పని ప్రదేశాలను పరిశీలించిన ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిలోని పని ప్రదేశాలను శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య యాజమాన్యంతో కలిసి సోమవారం పని ప్రదేశాలను పరిశీలించారు. కార్మికులు పనిచేస్తున్న ప్రదేశాలలో సరిపడ వెంటిలేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని సూచించారు. గని జీవితకాలం పెరగాలంటే సౌత్ సైడ్‌లో అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని, ఆ బొగ్గును వెలికి తీస్తే దాదాపు 10 నుండి 15 సంవత్సరాలు ఆర్కే సెవెన్ గని నడుస్తుందని యాజమాన్యం సౌత్ సైడ్‌లో బొగ్గు వెలికి తీసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాజమాన్యం స్పందించి పని స్థలాలలో వెంటిలేషన్ మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని గని జీవితకాలం పొడిగింపుకు చర్యలు తీసుకుంటామని ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ రాముడు, మేనేజర్ తిరుపతి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గని ఫిట్ కార్యదర్శి బీర రవీందర్, మైనింగ్ స్టాఫ్ నాయకులు పారుపల్లి రాజేందర్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని గ్రీన్ సిటీ సమీపంలో సోమవారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం..ఎస్ఐ సనత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి గ్రీన్ సిటీ సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులు పోలీసులను చూసి పారిపోయే క్రమంలో పట్టుకుని విచారించారు. గోలివాడ సాయితేజ, మారుపల్లి సుకుమార్ గంజాయితో అక్కడ ఉండగా కొనేందుకు గద్దెరాగడి నుండి యువకుడు సాయితేజ రావాల్సి ఉంది. వారి వద్ద నుండి రూ.2వేల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రతి నెల పాఠశాలలను సందర్శించాలి

ఆదిలాబాద్‌టౌన్ : ప్రతి నెల పాఠశాలలను ప్రత్యేకాధికారులు సందర్శించి రిజిస్టర్లను పరిశీలించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో డీఈఓ ప్రత్యేకాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పాఠశాలలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలను సందర్శించి నివేదికలు సమర్పించుటకు, నియమించబడిన ప్రత్యేకాధికారులు ప్రతి వారం పాఠశాలను సందర్శించినపుడు, తప్పనిసరిగా పాఠశాలల్లోని అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, రిజిస్టర్ అప్డేట్, ఎమ్ఎస్ఓలు, కాంప్లెక్స్ హెచ్ఎం లు అందులో సంతకం చేశారా లేదా అని పరిశీలించాలని అన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల నాణ్యతను పరిశీలించాలని, ఎఫ్ఎల్ఎన్ చూడాలని అన్నారు. ప్రతి పాఠశాలలోని విద్యార్థులు సరిగా చదవగలుగుతున్నారా లేదా పరిశీలించాలని, పాఠశాలల్లో టీచర్ల కొరత, ఇంకా మిగిలి ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తయ్యేల చూడాలని అన్నారు. అనంతరం పోషన్ అభియాన్ సెప్టెంబర్ పోషణ మాసంపై నెల రోజుల పాటు 1 నుంచి 30 వరకు నిర్వహించే కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, డీడబ్ల్యూఓ సబిత ఉన్నారు.

భారీ వర్షానికి నేలమట్టమైన ఇల్లు



నవతెలంగాణ-లోకేశ్వరం

రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని హావర్గ గ్రామానికి చెందిన వడ్నాల భూమేశ్ ఇల్లు ఆదివారం రాత్రి కుప్పకూలింది. ఇల్లు ఖాళీగా ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. కూలిన వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. ఇల్లు కూలిపోవడంతో చుట్టూ పక్కల వాళ్ల ఇంట్లో తలదాచుకున్నామని నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా తడిసిపోయాయని, దాతలు ఎవరైనా స్పందించి చేయూత నందించి, పునరావాసం కల్పించాలని కోరారు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న తహసీల్దార్ అర్క మొతీరాం సోమవారం సందర్శించి కూలిన ఇల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామని, బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు ఆర్ఐలు బాలకిషన్, లలిత, పంచాయతీ కార్యదర్శి అరుణ్, రెవిన్యూ సిబ్బంది, మాజీ సర్పంచ్ బుజంగ్‌రావు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బంది కల్గకుండా చూడాలి

నవతెలంగాణ-ఉట్నూర్

వర్షంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. సోమవారం పట్టణంలోని ఐబీ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద వర్షపు నీరు ఆగడంతో వాహనాలు రాకపోకలు నిలిచాయి. గత రెండు రోజుల నుంచి ఏకదాటిగా కురుస్తున్న వర్షంతో జనాలు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని ఐబీ ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. జెసీబీ సహాయంతో నీరు నిలువ కుండా చెత్తను తొలగించారు. ఆమె మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా శనివారం రాత్రి నుంచి సోమవారం వరకు కురుస్తున్న భారీ వర్షాలకు ఉట్నూర్ ఐబీ వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయానీ, రోడ్డుపై నీరు నిలువకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్డీఓ జీవాకర్‌రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. ప్రజలు సురక్షితంగా ఉండేలా అన్ని సహాయక చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉంటుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, నాయకులు, ప్రజలు ఉన్నారు.

టాక్సీ డ్రైవర్‌ల నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని షాదిఖానాలో సోమవారం బోథ్ మండల టాక్సీ డ్రైవర్‌ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోలంకి సుభాష్, ఉపాధ్యక్షుడిగా జమ్ము, ప్రధాన కార్యదర్శి సుంకరి భూమన్న, సంయుక్త కార్యదర్శి అబ్దుల్ రహీమ్, కోశాధికారులు జుమ్మెరత్, సాయి భారత్, ముఖ్య సలహాదారులుగా అర్క స్వామి, బోగ సాయి కుమార్, కార్యవర్గ సభ్యులుగా జుమ్మెరత్, పోశెట్టి, బండి శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు సోలంకి సుభాష్ మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు తోటి డ్రైవర్స్‌కి ధన్యవాదాలు తెలిపారు. రానున్న కాలంలో డ్రైవర్స్ సమస్యలు పరిష్కరించి, ప్రతి ఒక డ్రైవర్‌కు లేబర్ కార్డ్ వచ్చేలా ప్రభుత్వ తరుపున సబ్సిడీ రుణాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరే శంకర్, మెడిచెల్మ చందు, ఇప్ప తరుణ్, మాసం అనిల్ కుమార్, రమేష్ టాక్సీ డ్రైవర్స్ పాల్గొన్నారు.

జవాన్‌కు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన చకోర్ గంగాధర్, సవిత దంపతుల కుమారుడు చకోర్ ఆశీతోష్ ఇండియన్ నేవీలో ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా ఒడిస్సాలో శిక్షణ పూర్తి చేసుకొని సోమవారం గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామపెద్దలు గ్రామ యూత్ సభ్యులు రామమందిరంలో అభినందన సభ నిర్వహించి, శాలువాతో సన్మానించారు. ముందుగా, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహంతో పాటు మహనీయులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ విష్ణు ఫడ్ మాట్లాడుతూ నేటి సమాజంలో యువత మంచిగా చదివి దేశ రక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సమాజ పెద్దలు కేంద్రె సురేష్, సంతోష్, శివాజీ, ఉద్ధవ్, చోలె సురేష్, సుభాష్, విశాల్, శ్రావణ్, బాలాజీ, పి.శివాజీ, సంతోష్, యూత్ సభ్యులు ఫడ్ రవీందర్, గోపాల్, జితేందర్ ఉన్నారు.

ఉరుములు మెరుపులతో భారీ వర్షం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఉరుముల, మెరుపులతో కూడిన భారీ వర్షం వల్ల వాగులు, వంకలు పొంగిపోర్లాయి. పత్తి, సోయా తదితర పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. మండలంలో 180 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ శబ్దం రావడంతో ప్రజలు భయం గుప్పిట్లో రాత్రంతా గడిపారు. పిప్పిరి, దనోరతో పాటు అనేక గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోయాయి. అనేక ఫీడర్ల విద్యుత్ ఇన్సులేటర్‌లు మరమ్మత్తులకు గురయ్యాయి. దీంతో మండలంలో ఆదివారం రాత్రి నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లేక పోవటంతో ప్రజలు అంధకారంలో గడిపారు. తాగునీరు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వం నష్టపోయిన పంటలపై సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం అందించాలని మండల రైతులు కోరుతున్నారు.

నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి

• కడెం ప్రాజెక్టును సందర్శించిన మంత్రి శ్రీధర్ బాబు



నవతెలంగాణ-కడెం

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లతో కలిసి కడెం ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టులోని వరద నీరు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. జిల్లాలోని ఖానాపూర్, దస్తురాబాద్, పెంబి మండలాలలో అధిక వర్షపాతం నమోదు అయినందున నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్టు జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. చెరువులో వాగుల సమీపంలోకి ప్రజలు వెళ్లకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. రోడ్లపై వాగులు ప్రవహిస్తున్న చోట్ల బారికేడ్‌లు ఏర్పాటు చేసి ప్రజలు, వాహనాలు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ హైమద్, కిషోర్ కుమార్, డీఆర్ఓ భుజంగరావు, ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి, పోలీసు రెవెన్యూ నీటిపారుదల శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ 14వ విడత సామాజిక తనిఖీ

• ప్రజా వేదికలో పొంతన లేని సమాధానాలు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ ఉపాధిహామీ 14వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా 2023లో చేసిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ ప్రజావేదికకు ఏపీడీ కుటుంబరావు హజరయ్యారు. ఈ సందర్భంగా 2023లో చేసిన పనులను పరిశీలించి, ఆడిటింగ్ అధికారులచే లోటు పాట్ల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన లోటు పాట్లను వివరించారు. కొన్ని గ్రామాల్లో 4 వేల 300 మొక్కలు నాటితే, అందులో 12 మొక్కలు ఉన్నాయని అన్నారు. అంతేకాకుండా చనిపోయిన వ్యక్తుల మీద కూడా హాజరు వేసినట్టు, హైదరాబాద్‌లో ఉన్నవారికి కూడా హాజరు వేసి డబ్బులు లేపినట్టు తెలిపారు. అంతేకాకుండా సెలవు దినాలలో కూడా హాజరు వేసినట్టు తెలిపారు. ఆడిటింగ్ అధికారులు ఏవైనా పనులకు సంబంధించిన డాక్యుమెంట్స్ అడిగిన వారికి సహకరించలేదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన లోటు పాట్లను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్‌వీర్, ఏపీఓ వసంత్, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా వైయస్సార్ వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-ముథోల్

ముథోల్ ప్రభుత్వాస్పత్రి ఆవరణలో సోమవారం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని, కాంగ్రెస్ ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అన్నారు. అదేవిధంగా రైతు సంక్షేమానికి కృషిచేసిన రైతు బాంధవుడని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు కిషన్ పటేల్, నజీమ్ హైమద్, ఖలీద్ పటేల్, గజనంద్ పటేల్, నగేష్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్ : ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్, మండల అధ్యక్షులు మర్సకోల గౌతమ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, సీనియర్ నాయకులు అట్ల గోవర్ధన్‌రెడ్డి, నలిమేల నవీన్‌రెడ్డి, రహీమ్ ఖాన్, వెంకటేష్, అడెల్లు, తైమూర్ భాయ్, దినేష్, లస్మన్న పాల్గొన్నారు.

వ్యవసాయ కోర్సుల వైపు యువత అడుగులు వేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

వ్యవసాయ కోర్సుల వైపు యువత అడుగులు వేయాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అగ్రికల్చర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు కళాశాల విద్యార్థులచే స్మార్ట్ అగ్రికల్చర్, సస్టెన్ అగ్రికల్చర్, అర్గానిక్ ఫార్మింగ్, డ్రిప్ ఇరిగేషన్, హైడ్రో ఫోనిక్ సిస్టం, పాలి హౌస్ వంటి అంశాలపై ఏర్పాటు చేసిన ప్రజెంటేషన్‌ను సందర్శించి, పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యవసాయంపై ఆసక్తి కలిగిఉండి బీఎస్సీ అగ్రికల్చర్ వంటి కోర్సుల్లో చేరడం ద్వారా మంచి భవిష్యత్తును పొందవచ్చునని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో పోటీ ఎక్కువగా ఉన్నందున యువత దానిపై ఆధారపడకుండా భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉన్న అగ్రికల్చర్ బీఎస్సీని కెరీర్‌గా ఎంచుకోవడం ద్వారా ఎన్నో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని అన్నారు. కళాశాలలో చదువుకున్న ఎంతోమంది నేడు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్ చౌహాన్, కెవికె ఆదిలాబాద్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్‌రావు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ రాంప్రసాద్, ప్రొఫెసర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు విక్కీ, గోవర్ధన్ యాదవ్, లక్ష్మణ్, అగ్రికల్చర్ విద్యార్థులు పాల్గొన్నారు.


చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చిరు వ్యాపారులకు సోమవారం రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ గొడుగులను పంపిణీ చేశారు. రోడ్ల పక్కన కూర్చుని తోటలో పండించిన కూరగాయలను అమ్ముకొని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులందరికీ గొడుగులను పంపిణీ చేశారు. ఇబ్బందులు పడుతున్న వారికి సాయం చేయడం తన ధర్మం అని రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్, తాజా మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతి, సదాశివ, రాహుల్ పాల్గొన్నారు.



విద్యుత్ఘాతంతో ఎద్దు మృతి



నవతెలంగాణ-వేమనపల్లి

ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో ఎద్దు మృత్యువాత పడ్డ సంఘటన సోమవారం మండలంలోని క్యాతనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన చటారి పున్నం ఎద్దు సోమవారం ఉదయం బురద గూడెం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పక్కన ఉన్న సపోర్ట్ తీగకు ఎద్దు తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న రైతు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించాడు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు. ఈ మేరకు పశుసంవర్ధన శాఖ, విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వాగు వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలి

• ఎంపీఓ శ్రీపతి బాపు రావు

నవతెలంగాణ-జైపూర్

విస్తారంగా కురుస్తున్న వర్షాలకు టేకుమట్ల వాగు పొంగి ప్రవహిస్తోంది. అవసరమైతే తప్పా వాగు వైపు ఎవ్వరు వెళ్లకూడదని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు సూచించారు. సోమవారం టేకుమట్ల వాగు వద్ద వరద ఉధృతిని పరిశీలించిన ఆయన వరద ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలుగకుండా వరదతో వచ్చిన చెత్తను తీపించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామస్థులకు అవగాహణ కల్పించారు. ఎల్లంపల్లి గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్న నేపథ్యంలో గోదావరి నది వరద క్రమేపీ పెరుగుతోందని, వాగులు వంకలు పొంగిపొర్లుతున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను సోమవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు సోమవారం పరిశీలించారు. వినూత్న కాలనీ, బృందావన కాలనీలను సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్ వో సుధాకర్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులను పరిశీలించి, రోగులకు మంచి వైద్యం అందించాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ వో సూచించారు. పాఠశాలలు, అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయడానికి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవి కిరణ్, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ విభాగంలో పనిచేసి పదవి విరమణ పొందిన గొల్లపల్లి కనకయ్యను ఏరియా సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో సెక్యూరిటీ విభాగం కీలకమైనదని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్స్‌పెక్టర్ పోగుల స్వామి, జూనియర్ ఇన్స్‌పెక్టర్ సిర్ర రాజయ్య, జమ్మేదార్‌లు ఎస్కే దాస్, బడికెల రాం చందర్, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రెటరీ ఆడెపు మల్లికార్జున్ పాల్గొన్నారు.

కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని వినతి

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిలో గని మేనేజర్ భూ శంకరయ్యకు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందించారు. కార్మికులకు అందించాల్సిన లాభాల వాటా ప్రకటించాలని, 2023-24 సంవత్సరానికి సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు వొడ్నాల రాజన్న, పిట్ కార్యదర్శి బైరి శంకర్, బండారి రమేశ్, జాడి శివ పాల్గొన్నారు.

దేవాపూర్‌లో రైతు వివరాలు నమోదు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ గ్రామంలో పంట రుణమాఫీ పథకంలో భాగంగా కుటుంబ నిర్ధారణ చేయబడని రైతుల వివరాలను మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో వివరాలను నమోదు చేశారు. రుణమాఫీ యాప్‌లో కుటుంబం నిర్ధారణ లేని రైతుల కుటుంబాల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేసినట్లు ఏఓ తెలిపారు.